Crime Mirror QR Code
https://epaper.crimemirror.com/

# క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption

హైదరాబాద్
18-1-2025
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:13
సంచిక: 65

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



## తెలంగాణలో సింగపూర్ తరహా విద్యా విధానం

- ఆ దేశ ఐటీఈతో స్కిల్స్ యూనివర్సిటీ ఒప్పందం
- పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా సిలబస్
- పట్టా పొందగానే ఉద్యోగం దక్కేలా శిక్షణ
- విద్యా విధానంలో విప్లవాత్మకమన్న సీఎం రేవంత్
- ఐటీఈ ప్రతినిధులతో సీఎం, మంత్రి శ్రీధర్‌బాబు భేటీ
- సింగపూర్ విదేశాంగ శాఖ మంత్రితోనూ సమావేశం

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ.. సింగపూర్ ప్రభుత్వ ఆధీనంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐటీఈ) సంస్థతో ఎంఓయు కుదుర్చుకుంది. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్‌ల సమక్షంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సుబ్బారావు, ఐటీఈ డిప్యూటీ డైరెక్టర్ ఫాబియన్ చియాంగ్ శుక్రవారం ఒప్పంద పత్రాలను

# మీలో వేగమేదీ?!

- యువ మంత్రుల పనితీరుపై బాబు అసంతృప్తి
- ప్రజల్లోకి మరింతగా వెళ్లి పనిచేయాలని ఆదేశం
- మంత్రులు, ఎంపీలు, జోనల్ ఇన్‌చార్జులతో సమీక్ష
- కొందరు పార్లమెంటు సభ్యుల గైర్హాజరుపై ఆగ్రహం
- ప్రజాదరణ ఇప్పటికంటే 5 శాతం పెంచేలా లక్ష్యం


అమరావతి, జనవరి 17 : పాతవారిని పక్కన పెట్టి యువతరం అని కొత్తవారికి మంత్రి పదవుల్లో అవకాశం ఇస్తే వారిలో ఆ వేగం కనిపించడం లేదని సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం ఉండవల్లిలోని తన నివాసంలో మంత్రులు, ఎంపీలు, పార్టీ జోనల్ ఇన్‌చార్జులతో సుమారు 3గంటలపాటు సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో మంత్రుల పనితీరుపై సీఎం నిశితంగా వ్యాఖ్యానించినట్లు సమాచారం. “నా మంత్రివర్గంలో 24మంది మంత్రులు ఉంటే ఆరుగురు గతంలో మంత్రులుగా చేసినవారు ఉన్నారు. 18మందికి మొదటిసారి అవకాశం వచ్చింది. కొత్తవారికి అవకాశం ఇస్తే ఉత్సాహంగా పరిగెత్తుతారని భావించి.. ఇంతమందికి అవకాశం ఇచ్చాను. కానీ, కొంతమందిలో ఆ వేగం కనిపించడం లేదు. అవకాశం రానివారు.. రావడం లేదని బాధపడుతుంటే, వచ్చినవారు ఆ వేగం ఎందుకు చూపించలేకపోతున్నారు? ప్రజల్లోకి దూసుకు వెళ్లడానికి మీకువచ్చిన అడ్డం ఏమిటి? మీ పనితీరు మెరుగు పర్చుకోకపోతే నష్టపోతారు. మంత్రులుగా శాఖపై పట్టుసాధించాలి. అధికారులతో పని చేయించుకోవాలి. మీ జిల్లాలో పార్టీకి నాయకత్వం ఇవ్వాలి. ప్రజల్లోకి ప్రభుత్వం చేస్తున్న మంచిని బలంగా తీసుకువెళ్లాలి. నేను గమనిస్తున్నానని గుర్తించండి. వచ్చేసారి సమీక్ష నాటికి మీ పనితీరులో మార్పు కనిపించాలి” అని చంద్రబాబు వ్యాఖ్యానించినట్లు సమాచారం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన

(మిగతా 2వ పేజీలో)



## ఆరు గ్యారెంటీలని.. అర గ్యారెంటీ అమలు

- సర్పంచ్ ఎన్నికల్లో ఎక్కడికక్కడ నిలదీయండి
- బాకీలు అడిగినట్లుగా కాంగ్రెస్ నేతలను అడగండి
- తులం బంగారం సహా హామీలపై ప్రశ్నించండి
- చేవెళ్లలో ఉప ఎన్నిక రావడం ఖాయం
- హామీలను అమలు చేసేదాకా నిలదీస్తూనే ఉంటా
- షాబాద్ బిఆర్ఎస్ రైతు ధర్నా సభలో కెటిఆర్



**రంగారెడ్డి, (క్రైమ్ మిర్రర్):** కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారెంటీలని చెప్పి.. అర గ్యారెంటీ మాత్రమే అమలు చేశారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. కేవలం ఉచిత బస్సు ప్రయాణంతో సరిపెట్టారని ఆరోపించారు.



## నీటి వాటాల్లో అన్యాయం.. బీఆర్ఎస్ వైఫల్యమే!

రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



## సబ్‌ప్లాన్ నిధులు పూర్తిగా ఖర్చు చేయండి

సబ్‌ప్లాన్ సమీక్షలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

## ఏపీ పట్ల మోదీ నిబద్ధతకు రాష్ట్ర ప్రజల తరఫున కృతజ్ఞతలు: పవన్ కల్యాణ్


- విశాఖ ఉక్కు పరిశ్రమకు కేంద్రం భారీ ప్యాకేజి
- హర్షం వ్యక్తం చేసిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- ఉక్కు పరిశ్రమ తెలుగువారికి గర్వకారణంలా నిలుస్తుందని ధీమా



విశాఖ ఉక్కు కర్మాగారానికి కేంద్ర ప్రభుత్వం రూ.11,440 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. వైజాగ్ స్టీల్ ప్లాంటుకు కేంద్రం ప్యాకేజీ ప్రకటించడం చాలా సంతోషకరం అని పేర్కొన్నారు. ఉక్కు పరిశ్రమను నిలబెట్టాలన్న ప్రధాని నరేంద్ర మోదీ నిబద్ధతకు ఈ ప్యాకేజి నిదర్శనమని వివరించారు. ఏపీ అభివృద్ధి పట్ల మోదీ చిత్తశుద్ధికి రాష్ట్ర ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని వెల్లడించారు. ప్యాకేజి కేవలం ఓ సంఖ్య కాదని, ఇది వేల కుటుంబాల్లో ఆశలు రేకెత్తించిందని తెలిపారు. కార్మికులు, ప్లాంట్ తో అనుబంధం ఉన్నవారు ప్లాంట్ ను నిలబెట్టుకున్నారని పవన్ వ్యాఖ్యానించారు. “ఆత్మనిర్భర్ భారత్ కల సాకారం క్రమంలో విశాఖ ఉక్కు పరిశ్రమ కూడా ఒకటి. ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామికి ధన్యవాదాలు. ముఖ్యమంత్రి చంద్రబాబు గారి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంలో విశాఖ ఉక్కు పరిశ్రమ మనుగడ సాగించడమే కాదు... మరింత అభివృద్ధి చెందుతుంది. వికసిత్ భారత్-2047 నిర్మాణంలో తెలుగువారికి గర్వకారణంలా నిలుస్తుంది. కేంద్ర ప్యాకేజీ కేవలం ఆర్థిక పునరుద్ధరణ మాత్రమే కాదు... మన పెద్దలు త్యాగాలతో రాసిన వాగ్దానాన్ని నెరవేర్చడం. విశాఖ ఉక్కు కోసం ప్రాణ త్యాగాలు మన హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటాయి” అని పవన్ పేర్కొన్నారు.

## జనవరి 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

ఢిల్లీ: రెండు విడతల్లో పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నిర్వహణకు తేదీలు ఖరారయ్యాయి. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు తొలి విడత, మార్చి 10 నుంచి ఏప్రిల్ 4 వరకు రెండో విడత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. ఈ నెల 31న పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగంతో సమావేశాలు ప్రారంభం కానున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. ఫిబ్రవరి 5న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా, బడ్జెట్‌లో ఢిల్లీ కేంద్రంగా ఎలాంటి ప్రకటనలు చేయకూడదని.. ఎన్నికల సంఘం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.







## తెలంగాణలో సింగపూర్ తరహా విద్యా విధానం

(మిగతా 2వ పేజీలో)

మార్చుకున్నారు. సింగపూర్ ఐటీఈ పదో తరగతి చదివే విద్యార్థుల స్థాయి నుంచి చదువు పూర్తి చేసిన యువత, ఆసక్తి ఉన్న ఏ వయసు వారికైనా.. పరిశ్రమలు, ఐటీ సంస్థల సహకారంతో జాబ్ రెడీ శిక్షణను ఇస్తుంది. 'స్కిల్స్ ఫర్ ఫూచర్, స్కిల్స్ ఫర్ లైఫ్' అనే నినాదంతో పనిచేస్తున్న ఐటీఈలో ప్రస్తుతం 28 వేల మంది శిక్షణ పొందుతున్నారు. మొత్తం వంద ఫుల్ టైమ్ కోర్సులకు ఆన్‌లైన్, క్యాంపస్ శిక్షణ ఇక్కడ అందుబాటులో ఉంటుంది. ఐటీఈకి ఐదు వేల పరిశ్రమలతో భాగస్వామ్యం ఉంది. పరిశ్రమలు తమకు అవసరమైన మానవ వనరులకు ఐటీఈలో నేరుగా శిక్షణనిచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయి. అదే స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటైన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ తన శిక్షకులకు ఐటీఈతో ట్రెయినింగ్ (ట్రెయినింగ్ ఫర్ ట్రెయినర్స్) ఇప్పించేలా ఒప్పందరం కుదుర్చుకుంది. తాజా ఎంఓయు వల్ల సింగపూర్ ఐటీఈ పాఠ్యాంశాలను మనం ఉపయోగించుకునే వీలు కలుగుతుంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సింగపూర్‌లో పర్యటిస్తున్నారు. ముఖ్యమంత్రి తొలిరోజు పర్యటనలోనే ఈ కీలక ఒప్పందం జరిగింది. ముఖ్యమంత్రి సింగపూర్ పర్యటనలో తొలిరోజు విశేష స్పందన లభించింది. పర్యటనలో భాగంగా సింగపూర్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐటీఈ) క్యాంపస్‌ను సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు సందర్శించారు. అక్కడ నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు, అధునాతన సదుపాయాలను పరిశీలించారు. అక్కడ శిక్షణను అందిస్తున్న దాదాపు 20 రంగాలకు చెందిన నిపుణులు, కాలేజీ సిబ్బందిని కలిసి మాట్లాడారు. అనంతరం ఐటీఈ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి బృందం చర్చలు జరిపింది. హైదరాబాదులోని ఫోర్త్ సిటీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. వివిధ రంగాల్లో యువతకు ఉపాధి కల్పించేందుకు మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా వివిధ కోర్సులు నిర్వహిస్తున్న తీరును ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. నైపుణ్యాల అభివృద్ధి (స్కిల్ డెవెలప్మెంట్) శిక్షణలో భాగస్వామ్యం కోసం పరస్పర సహకారం అందించాలని కోరారు. దీనిపై ఐటీఈ ప్రతినిధి బృందం సానుకూలంగా స్పందించింది. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో కలిసి పని చేసేందుకు సంసిద్ధతను వ్యక్తం చేసింది. చర్చల అనంతరం నైపుణ్యాల అభివృద్ధిలో కలిసి పని చేసేందుకు ఐటీఈ, స్కిల్ యూనివర్సిటీ పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. త్వరలోనే ఐటీఈ ప్రతినిధి బృందం హైదరాబాద్‌ను సందర్శించనుంది. కాగా.. ఉదయం సింగపూర్ విదేశాంగ మంత్రి వీవీఎన్ బాలకృష్ణతో రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. గ్రీన్ ఎనర్జీ, మూసీ పునరుజ్జీవనం, పర్యాటకం, విద్య, ఐటీ, నైపుణ్య నిర్మాణంపై వారు చర్చించారు. సీఎంతో పాటు ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్‌రంజన్ భేటీలో పాల్గొన్నారు.

### ఐటీఈతో స్కిల్స్ యూనివర్సిటీ ఒప్పందం

సింగపూర్ ఐటీఈ స్ఫూర్తితో తెలంగాణలో ఏర్పాటైన యంగ్ ఇండియా స్కిల్స్ యూని వర్సిటీ.. తన శిక్షకులకు ఐటీఈతో శిక్షణ (ట్రెయినింగ్ ఫర్ ట్రెయినర్స్) ఇప్పించేలా పరస్పర అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. ప్రస్తుతం సింగపూర్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు శుక్రవారం ఐటీఈ ప్రతినిధులతో సమావేశమయ్యారు. వీరి సమక్షంలో ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ సుబ్బారావు, ఐటీఈ డిప్యూటీ డైరెక్టర్ ఫాబియన్ చియాంగ్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ ఒప్పందంతో.. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఉన్న సింగపూర్ ఐటీఈ తమ పాఠ్యాంశాలను (కరికులమ్) తెలంగాణ రాష్ట్రంతో పంచు కోనుంది. ఇక్కడి పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు కావాల్సిన సహ కారం అందించనుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యా విధానంలో ఇదో విప్లవాత్మకమైన నిర్ణయమన్నారు. చదువు పూర్తయ్యాక ఉద్యోగం వస్తుందా, రాదా.. అన్న ఆందోళనలో ఉండే యువతకు తాజా ఒప్పందం శుభవార్త అని వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందంతో రాష్ట్రంలోని యువతకు ఉపాధి అవకాశాలు లభించ డంతోపాటు పరిశ్రమలకు నైపుణ్యమున్న మానవ వనరులు లభిస్తాయని పేర్కొన్నారు. ఐటీఈ ప్రతినిధులతో భేటీ అనంతరం సింగపూర్ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తో సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబు సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వానికి సింగపూర్ ఐటీఈ అందిస్తున్న సహకారానికి ధన్యవాదాలు తెలిపారు. పారిశ్రామిక రంగంలో సింగపూర్ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోందని సీఎం రేవంత్ కొనియాడారు.

## సబ్‌ప్లాన్ నిధులు పూర్తిగా ఖర్చు చేయండి

### సబ్‌ప్లాన్ సమీక్షలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

(మిగతా 2వ పేజీలో)

హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలులో భాగంగా ప్రభుత్వ శాఖలకు కేటాయించిన నిధులను నూరు శాతం ఖర్చు చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలుపై ఉన్నతాధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కేటగిరీలవారీగా సమీక్షించి పలు సూచనలు చేశారు. సబ్‌ప్లాన్ చట్టం ప్రకారం ప్రభుత్వ శాఖలకు కేటాయించిన నిధులు, చేసిన ఖర్చు వివరాలను ప్రతి నెలా వెల్లడించాలని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. సబ్‌ప్లాన్‌కు సంబంధించిన పూర్తి వివరాలతో ఈ నెల 23న నిర్వహించబోయే సమావేశానికి హాజరు కావాలని శాఖాధిపతులను ఆదేశించారు. బడ్జెటేతర నిధుల వ్యయంలోనూ సబ్‌ప్లాన్ చట్టం ప్రకారం జనాభా దామాషాలో నిధుల ఖర్చు జరిగిందా? లేదా? అనే సంపూర్ణ సమాచారం అందించాలని సూచించారు. సబ్‌ప్లాన్ అమలుకు సంబంధించి గత ఎనిమిదేళ్లలో క్షేత్రస్థాయిలో వివిధ శాఖల్లో అధ్యయనం చేసి సెస్ రూపొందించిన నివేదికపై ఈ సమావేశంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

### అటవీ భూముల్లో వాణిజ్య పంటలు

అటవీ భూముల్లో వ్యవసాయ మోటార్లకు సోలార్ విద్యుత్తు వినియోగించాలని భట్టి విక్రమార్క సూచించారు. ఆయా భూముల్లో వెదురు, అవకాడో, పామాయిల్ వంటి వాణిజ్య పంటలతోపాటు అంతర పంటల సాగు ప్రాజెక్టులు డిజైన్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పంటలతో ఆదివాసీ, గిరిజన రైతులకు ఆదాయాలు పెరుగుతాయని పేర్కొన్నారు. మూసీ పునర్జీవనం పథకంలో నిర్వాసితులవుతున్న ఎస్సీ, ఎస్టీ మహిళలను స్వయం సహాయక సంఘ సభ్యులుగా చేర్పించి, వారికి వడ్డీ లేని రుణాలు అందించాలని సూచించారు. స్వయం ఉపాధి కింద పట్టణ ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీలకు రవాణా వాహనాలు, క్లీనింగ్ యంత్రాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, సీనియర్ ఐఏఎస్ అధికారులు వికాస్ రాజ్, దాన కిషోర్, ఎన్.శ్రీధర్, శరత్ పాల్గొన్నారు.



## మీలో వేగమేదీ?!

(మొదటి పేజీ తరువాయి)

ఏడు నెలల స్వల్ప వ్యవధిలోనే అసాధ్యం అనుకొన్న పనులు అనేకం చేశామని చంద్రబాబు తెలిపారు. వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో మంత్రులు అలసత్వంతో వ్యవహరిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఆగిపోయిన అమరావతిని పట్టాలెక్కించాం. పోలవరం విధ్వంసం చేశారు. అది కూడా పూర్తి కాగలదన్న నమ్మకం కలిగించాం. విశాఖ ఉక్కుకు కేంద్రం సాయం సాధించాం. వచ్చిన మొదటి నెలలోనే పేదల పింఛన్లు పెంచాం. ధాన్యం విక్రయించిన రైతులకు 24 గంటల్లో డబ్బులు జమ చేస్తున్నాం. 7 నెలల్లో రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. మీలో ఎంత మంది ఈ విషయాలు ప్రజల్లోకి వెళ్లి మాట్లాడుతున్నారు? ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు అవగాహన కలిగిస్తున్నారు? మనం చేసిన పనులు చెప్పలేకపోతే ప్రత్యర్థుల దుష్ప్రచారం ప్రజల మనసుల్లోకి వెళ్తుంది" అని చంద్రబాబు అన్నారు.

### ప్రజల సంతృప్తి ఇలా..

కూటమి ప్రభుత్వం పట్ల ప్రజల సంతృప్తిలో ఏ జిల్లాలో పరిస్థితి ఎలా ఉందో చంద్రబాబు చెప్పారు. కృష్ణా, చిత్తూరు, ఎన్టీఆర్ జిల్లాలు మొదటి మూడు స్థానాల్లోనూ, కడప, అల్లూరి సీతారామరాజు జిల్లా, తూర్పుగోదావరి చివరి మూడుస్థానాల్లో ఉన్నాయని తెలిపారు. సామాజిక మాధ్యమాలను వినియోగించుకోవడంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఆయన మార్కులిచ్చారు. మంత్రుల్లో ఫరూక్ చివరిస్థానంలో ఉన్నారు. "సామాజిక మాధ్యమాల వినియోగం పెంచుకోవాలి. మీకు ప్రత్యేకంగా ఉద్యోగులను, పీఆర్వోలను ఇచ్చాను. అయినా కొంతమంది ఇంకా వెనకబడే ఉన్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఐటీ రంగంలో పనిచేసి వచ్చారు. ఆయన ర్యాంక్ కూడా సంతృప్తికరంగా లేదు. ఈసారి నాకు మీ నుంచి మంచి ఫలితాలు కనిపించాలి" అని చంద్రబాబు అన్నారు.

### ఇన్‌చార్జి మంత్రులకు మరిన్ని బాధ్యతలు

జిల్లా ఇన్‌చార్జి మంత్రులకు మరిన్ని బాధ్యతలు అప్పగిస్తున్నట్లు సీఎం తెలిపారు. "మీ జిల్లాల్లో పార్టీ, యంత్రాంగాన్ని సమన్వయం చేసే బాధ్యత మీదే. ఊరికే డీడీఆర్సీ సమావేశాలకు హాజరై తిరిగి రావడం కాకుండా జిల్లాల్లో రాజకీయ పరిస్థితిపై పట్టుపెంచుకోండి. అవసరమైతే మండలస్థాయి వరకు వెళ్లండి. కొత్త ఎమ్మెల్యేలు చాలా తప్పులు చేస్తున్నారు. వారికి ఏది తప్పో చెప్పండి. మీకు మొహమాటం ఉంటే నాకు చెప్పండి. నేను ఏ సమయంలో ఫోన్ చేసినా.. బాధ్యత అప్పగించినా నాకు వెంటనే ఫలితం కనిపించాలి. జిల్లాల్లో ఇన్‌చార్జి మంత్రి, జిల్లాకు చెందిన మంత్రి, ఎంపీ, కలెక్టర్ ఒక బృందంగా పనిచేసి మంచి ఫలితాలు సాధించాలి" అని సూచించారు. రేషన్ షాపుల విషయం కోర్టుకు వెళ్లిందని, ఈలోపు ఇన్‌చార్జులను నియమిస్తామని తెలిపారు. ఇకనుంచి పార్టీకి ఎక్కువ సమయం ఇస్తానని, ఈ విషయంలో తేడాను త్వరలోనే చూస్తారని చంద్రబాబు చెప్పారు.

### నేను కఠినంగా ఉండేదాకా..!

సీఎం చంద్రబాబు నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఇద్దరు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు గంటి హరీశ్, అంబికా లక్ష్మీనారాయణ గైర్హాజరయ్యారు. ఈ విషయంపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. "కమిటీ మీటింగులు, ఇతర పనులు పార్టీ పని కంటే మీకు ఎక్కువా? నేను మొదటిసారి ఈ సమావేశం పెట్టాను. ఏ సమావేశం ప్రాధాన్యం ఏమిటో కూడా అర్థం కావడం లేదా? కొందరు ఎంపీలు పార్టీ పనిని

## రాష్ట్రంలో దోపిడీ ముఠా తిరుగుతోంది

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేశారు. శుక్రవారం షాబాద్‌లో నిర్వహించిన రైతుదీక్షలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన ఆ తర్వాత మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 'రాష్ట్రంలో తిరుపతిరెడ్డి, కొండల్‌రెడ్డి, వేం నరేందర్‌రెడ్డి, రోహిణ్‌రెడ్డి, ఫహీం ఖురే, ఏవీ రెడ్డిలతో కూడిన అలీబాబా అర డజన్ దొంగల ముఠా తిరుగుతోంది. బ్లాక్‌మెయిళ్లు, అక్రమ వసూళ్లతో పాటు కబ్జాలు, భూ దందాలు చేస్తోంది. ఇవన్నీ బయటపడతాయనే తప్పుడు కేసులు పెడుతున్నారు. డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు.

### పైసా లాభం లేకుండా క్విడ్ ప్రోకో ఎక్కడిది?


కొన్ని రోజులు కాళేశ్వరం, మరికొన్ని రోజులు ఫోన్ ట్యాపింగ్ కేసుల పేరుతో ప్రభుత్వం టైం పాస్ చేసింది. ఇప్పుడు ఫార్ములా ఈ కార్ రేసు నిర్వహణపై ఏమీ లేనటువంటి ఏసీబీ కేసును ప్రజలను డైవర్ట్ చేసేందుకు వాడుకుంటోంది. ఏసీబీ, ఈడీ విచారణలో ఎలాంటి అవినీతి లేదని స్పష్టమైంది. గ్రీన్ కో కంపెనీకి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం వల్ల ఒక రూపాయి అయినా లాభం జరిగిందా? ఆ కంపెనీకి ఎలాంటి లబ్ధి చేయనప్పుడు క్విడ్ ప్రో కో అనే మాట ఎలా వర్తిస్తుంది? ప్రభుత్వం ఖర్చు చేసిన రూ.46 కోట్లలో నయా పైసా అయినా మాకు వచ్చిందా? మాకు జైళ్లు, ప్రభుత్వ వేధింపులు కొత్తకాదు. బీజేపీ%-%కాంగ్రెస్, ఈడీ%-%ఏసీబీ కలిసి ఎన్ని కేసులు పెట్టుకున్నా..నేను ప్రజల తరఫున ప్రశ్నించడాన్ని ఆపబోను. నాపై కేసుల్ని న్యాయపరంగానే ఎదుర్కొంటా. మేం గతంలో చేసిన పెట్టుబడి ప్రయత్నాల ఫలితంగానే రాష్ట్రంలో ఈ రోజు పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ఉపాధి అవకాశాలు దొరుకుతున్నాయి. కానీ కాంగ్రెస్ హయాంలో పైసా పెట్టుబడి రాలేదు..'అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

### కాంగ్రెస్‌వి ప్రతిచోటా మోసాలే..

'కాంగ్రెస్ పార్టీ గెలిచిన ప్రతిచోటా మోసాలకు పాల్పడుతోంది. గ్యారంటీల పేరుతో ఓట్ల గారడీ చేస్తోంది. కర్ణాటకలో ఇప్పటికే 15 శాతం బస్సు చార్జీలను పెంచారు. ఇక్కడ స్థానిక సంస్థల ఎన్నికల కోసం రైతు భరోసా పేరుతో మళ్లీ మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల తర్వాత భరోసాను ఎత్తేస్తారు. కాంగ్రెస్‌ను ఢిల్లీ ప్రజలు కూడా ముమ్మాటికీ తిరస్కరిస్తారు. అక్కడ ఆమ్ ఆద్మీ పార్టీని ఓడించేందుకు కాంగ్రెస్ ప్రయత్నం చేస్తోంది.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకోవాలి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళితే ఊరుకోం. బడుగు, బలహీన వర్గాల తరఫున ప్రశ్నిస్తూనే ఉంటాం. సాగునీటిని అందజేయడంతో పాటు వివిధ పథకాలతో రైతులకు, వ్యవసాయానికి కేసీఆర్ చేసినంత సేవ దేశ చరిత్రలో ఎవరూ చేయలేదు. మా పార్టీకి ఆయువు పట్టుగా ఉన్న రైతన్నల కోసం ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తెస్తూనే ఉంటాం. విచారణల పేరుతో పక్కదారి పట్టించేందుకు ప్రయత్నించినా మా పోరాటం ఆపబోం..'అని కేటీఆర్ స్పష్టం చేశారు.

## నీటి వాటాల్లో అన్యాయం.. బీఆర్ఎస్ వైఫల్యమే!



హైదరాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యం కారణంగానే పదేళ్లుగా కృష్ణా జలాల పంపకాల్లో తెలంగాణకు అన్యాయం జరిగిందని సాగునీటి శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. న్యాయమైన నీటి వాటా దక్కించుకోవడంలో బీఆర్ఎస్ సర్కారు ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన తాజా తీర్పుపై బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం ఆయన సుదీర్ఘ పత్రికా ప్రకటన విడుదల చేశారు. కృష్ణా నదీ జలాల వివాదంలో తెలంగాణలో ఉన్న పరీవాహక ప్రాంతం, ఆయకట్టు ఆధారంగా వాటాలు పెరగాలని తొలినుంచి కాంగ్రెస్ పార్టీనే పోరాటం చేస్తోందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన కొద్ది నెలలకే 2015 జూన్‌లో అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం అప్పటి ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుందని గుర్తుచేశారు. ఉమ్మడి ఏపీకి కేటాయించిన 811 టీఎంసీల్లో తెలంగాణకు 299, ఏపీకి 512 టీఎంసీల నీటిని వాడుకునేలా ఒప్పందం చేసుకొని రాష్ట్ర ప్రయోజనాలను బీఆర్ఎస్ తాకట్టు పెట్టిందని మండిపడ్డారు. ఆ చీక టి ఒప్పందంతోనే తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కృష్ణా జలాల్లో ఏపీకి 70 శాతం, తెలంగాణకు 30 శాతం వాటా మేరకు ఒప్పుకుని బీఆర్ఎస్ అన్యాయం చేస్తే.. తెలంగాణకు 70 శాతం వాటా రావాలనే వాదనను లేవనెత్తింది కాంగ్రెస్ ప్రభుత్వమని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఖరిని కాంగ్రెస్ నిలదీసినందుకే సెక్షన్ 3 అంశం తెరపైకి వచ్చిందని చెప్పారు. గత ఎన్నికలకు కొద్ది రోజుల ముందు కేంద్ర ప్రభుత్వం టరమ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీవోఆర్)కు ఓకే చెప్పింది తప్ప.. ఇందులో బీఆర్ఎస్ గొప్పతనమేమీ లేదని అన్నారు. నదీ జలాల వాటాలను తేల్చకుండా జాప్యం జరగడంలో బీఆర్ఎస్ ప్రధాన దోషి అని నిందించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతే బ్రిజేశ్ ట్రిబ్యునల్ ద్వారా నీటి కేటాయింపులు చేయాలని కేంద్రంపై ఒత్తిడి పెంచామని చెప్పారు. కృష్ణా జలాల విషయంలో బీఆర్ఎస్‌కు ఆయన పలు ప్రశ్నలు సంధించారు.



## రష్యా-ఉక్రెయిన్ వార్: 16 మంది భారతీయులు మిస్సింగ్, 12 మంది మృతి

ఢిల్లీ: రష్యా-ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధంలో రష్యా తరఫున పోరాడుతున్న 16 మంది భారతీయులు కనిపించకుండా పోవడంతో పాటు, ఇప్పటి వరకు 12 మంది మరణించినట్లు కేంద్ర విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ వెల్లడించారు. ప్రస్తుతం రష్యాలో చిక్కుకుని యుద్ధంలో పోరాడుతున్న భారతీయ పౌరులందరినీ స్వదేశానికి రప్పించడం కోసం తాము రష్యన్ అధికారులతో నింతరం సంప్రదింపులు జరుపుతున్నామని వెల్లడించారు.రష్యా తరఫున యుద్ధంలో 126 మంది భారతీయులు పాల్గొన్నట్లు సమాచారం ఉందన్న విదేశాంగ మంత్రిత్వ శాఖ.. 96 మంది సైన్యం నుంచి విడుదలయ్యారని పేర్కొంది. కొందరు స్వదేశానికి తిరిగివచ్చారని.. ఇక 18 మంది ఇంకా సైన్యంలోనే పనిచేస్తున్నారని జైశ్వాల్ తెలిపారు. వారిలో 16 మంది ఆచూకీ లేదని స్పష్టం చేశారు.తాజాగా రష్యా తరఫున యుద్ధంలో పాల్గొన్న భారతీయుడు మృతిచెందడం తీవ్ర కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో భారతీయుడి మృతిని దేశ విదేశాంగశాఖ తీవ్రంగా పరిగణించింది. దీంతో, రష్యా యుద్ధంలో పాల్గొంటున్న భారతీయులను వెంటనే విడుదల చేయాలని కోరింది. ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో రష్యాకు మద్దతుగా యుద్ధం చేస్తున్న కేరళకు చెందిన బినిల్ బాబు(32) మృతిచెందాడు. అలాగే, అతడి సమీప బంధువు టీకే జైన్ (27)కు గాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో బినిల్ చనిపోయిన విషయాన్ని మాస్కోలోని భారత రాయబార కార్యాలయం తెలియజేసిందని అతడి బంధువులు మీడియాతో చెప్పారు. ఈ విషయం తెలిసి కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమవుతున్నారు. ఈ క్రమంలో భారతీయుడి మృతిపై భారత విదేశాంగ శాఖ స్పందించింది.



## ప్రజల దృష్టిని మళ్లించేలా రాజకీయ ఎత్తుగడలు

**కేసులపై ప్రజలను తప్పదోవ పట్టిస్తున్న కెటిఆర్**

**రైతుభరోసాపైనా రాజకీయ ధర్నాలు**

**బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ జీవన్ రెడ్డి**

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** ప్రజల దృష్టిని మళ్లించడమే లక్ష్యంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ రాజకీయ ఎత్తుగడలు వేస్తున్నారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మండిపడ్డారు. బిఆర్ఎస్ పోరాటం చేయడంతోనే కాంగ్రెస్ రైతుభరోసా ఇచ్చిందని చెప్పడానికి ప్రయత్నాలు చేస్తున్నారని చురకలంటించారు. అందుకే బిఆర్ఎస్ నేతలు రైతు దీక్ష చేపట్టారని దుయ్యబట్టారు. రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ పాటుపడుతోందని, ఈ నెల 26 నుంచి రైతు భరోసా అమలు చేస్తామని స్పష్టం చేశారు. రైతు కూలీలకు ఆత్మీయ భరోసా కింద రూ.12 వేలు ఇస్తామని జీవన్‌రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కేటీఆర్‌పై విచారణ జరుగుతోందని, అయితే తనపై వచ్చిన ఆరోపణలను కేటీఆర్ వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఫార్ములా కేసు రేసు నుంచి దృష్టి మరల్చే ఎత్తుగడలను కేటీఆర్ చేస్తున్నారని ఆక్షేపించారు. శుక్రవారం సీఎల్పీ మీడియా పాయింట్‌లో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. తాము దీక్ష చేస్తేనే కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా అమలు చేస్తుందని చెప్పుకోవడానికి బీఆర్ఎస్ నేతలు ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏడాదిలో దేశంలో ఎక్కడ లేని విధంగా రైతు సంక్షేమం కోసం పాటు పడుతుందని తెలిపారు. రైతు భరోసా పేరుతో ఈనెల 26వ తేదీ నుంచి రైతుకు ప్రోత్సహం కింద ఎకరాకు రూ.12 వేలు ఇస్తామని జీవన్‌రెడ్డి చెప్పారు. రైతు కూలీలకు ఆత్మీయ భరోసా కింద రూ.12 వేల ఆర్థిక సహాయం అందజేస్తామని అన్నారు.

## రేవంత్ ప్రభుత్వ వేధింపులు ఎక్కువయ్యాయి

**మాసాబ్ ట్యాంక్ పోలీస్ స్టేషన్ విచారణకు వచ్చిన కౌశిక్ రెడ్డి**

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాసబ్ ట్యాంక్ పోలీసు స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. తన న్యాయవాదితో కలిసి విచారణకు వచ్చారు. బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ విధులకు ఆటంకం కలిగించిన కేసులో కౌశిక్‌రెడ్డిని విచారించారు. గతేడాది డిసెంబర్ 4న ఫోన్ ట్యాపింగ్ జరిగిందని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు కౌశిక్‌రెడ్డి వెళ్లారు. సీఐ వాహనానికి తన వాహనం అడ్డుపెట్టి అనుచరులతో హల్‌చల్ చేశారు. దీంతో పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. మాసబ్ ట్యాంక్‌లో విచారణ ముగిసిన అనంతరం కౌశిక్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ...రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏ విధంగా వేధిస్తుందో అందరూ గమనిస్తున్నారని విమర్శించారు. బాధ్యతగల పౌరుడిగా విచారణకు సహకరించేందుకు పోలీసు స్టేషన్‌కు వచ్చినట్లు చెప్పారు. 'గతంలో బంజారాహిల్స్‌లో పిటిషన్ ఇచ్చేందుకు సీఐ దగ్గరికి వెళ్తే ఆయన లేచి పరుగులు పెట్టబోయారు. బాధ్యత గల ఎమ్మెల్యేగా నేను స్టేషన్‌కు వెళ్లినప్పుడు సీఐగా ఆయన బయటికి పరుగులు పెట్టొచ్చా అన్నారు. ప్రజాప్రతినిధులు ప్రభుత్వ కార్యాలయానికి వచ్చినప్పుడు రిసీవ్ చేసుకోవాలా వద్దా? సీఐ బయటికి వెళ్తున్న క్రమంలో.. నేను పిటిషన్ ఇచ్చేందుకు వచ్చానని చెప్పాను. పిటిషన్ తీసుకొని వెళ్తే అయిపోతుంది కదా అన్నాను. పిటిషన్ ఇచ్చిన రెండు గంటల తర్వాత నాపై కేసులు నమోదు చేశారు. వందలాది మంది పోలీసులను మరుసటి రోజు నా ఇంటికి పంపించారు. డోర్లు పగులగొట్టి నా బెడ్‌రూమ్ దగ్గరికి వచ్చి అరెస్టు చేశారు. నా ఇంటి డోర్లు పగులగొట్టే హక్కు పోలీసులకు ఎవరు ఇచ్చారు? నా బెడ్‌రూమ్ దగ్గరికి వచ్చి అరెస్టు చేసేందుకు నేను క్రిమినల్‌నా?' అని కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు.

## స్థానిక ఎన్నికలపై నజర్

**సంక్రాంతి పలకరింపులతో హల్‌చల్**

**నిజామాబాద్,(క్రైమ్ మిర్రర్):** బీసీ గణనకు సంబంధించి కమిషన్ల రిపోర్టులు రాగానే రిజర్వేషన్లు పెంచి లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. గత ఫిబ్రవరిలోనే సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసింది. జులైలో ఎంపీటీసీ, జడ్పీటీసీలు కూడా మాజీలయ్యారు. ఈనెలలో మున్సిపల్ కార్పొరేషన్లు, కౌన్సిళ్ల టర్మ్ పూర్తికానుంది. దీంతో రూరల్, అర్బన్ లోకల్ బాడీలకు వరుసగా ఎన్నికలు జరగనున్నాయి. కొత్తగా 15 గ్రామ పంచాయతీలు ఏర్పడడంతో జిల్లాలో పంచాయితీల సంఖ్య 545 పెరిగింది. ఈ క్రమంలో జిల్లాలో అప్పుడే స్థానిక హడావిడి మొదలయ్యింది. ముఖ్యంగా పంచాయితీ సర్పంచ్ పదవులకు పోటీ చేసే వారంతా ఇప్పటి నుంచే గ్రామాల్లో కరచాలనాలు మొదలు పెట్టారు. పలకరింపులు చేస్తున్నారు. బాగున్నావా అని ఆత్మీయంగా చూస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో ఇదే సందడి కనిపించింది. వాడు సర్పంంకు పోటీ చేస్తున్నాడనే కామెంట్స్ కూడా బాగానే వినిపించాయి. ఇకపోతే జిల్లాలో మహిళా ఓటర్లు అధిక సంఖ్యలో ఉన్నారు. జిల్లా పరిధిలో ఐదు అసెంబ్లీ నియోజక వర్గాలతో పాటు బాన్సువాడ సెగ్మెంట్‌లోని కొన్ని మండలాలున్నాయి. తుది ఓటర్ల జాబితాను అధికారులు ఇటీవల ప్రకటించారు. తాజాగా జిల్లాలో 14,35,214 మంది ఓటర్లుండగా పురుషులకన్నా 80,875 మంది మహిళా ఓటర్లు ఎక్కువ ఉన్నట్టు లెక్క తేలింది. మహిళల తర్వాత యువ ఓటర్లే కీలకం కానున్నారు. కొత్తగా ఓటు హక్కు పొందినవారు 26 వేల వరకు ఉన్నారు. మొత్తం ఓటర్లలో యువతీయువకులే దాదాపు సగం వరకు ఉన్నారు. కొత్త జాబితా ప్రకారం 18 నుంచి 39 ఏండ్ల మధ్య వయస్సున్న ఓటర్ల సంఖ్య 6, 96,014. దీంతో రానున్న లోకల్? బాడీ ఎన్నికల్లో మహిళలు, యువతే కీలకం కానున్నారు. దీంతో యువతలో కూడా సర్పంచ్ పదవులపై ఆశ కనిపిస్తోంది. పంచాయితీలతో పాటు వాటి పరిధిలోని 5,022 వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. బ్యాలెట్ బాక్స్ లతో పాటు పేపర్ బ్యాలెట్ రెడీ చేశారు. జిల్లాలో 31 మండలాలున్నాయి. పంచాయతీ ఎన్నికల తర్వాత ఈ మండలాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలన్నింటిలోనూ యువత, మహిళలే నిర్ణేతలు కానున్నారు. వారు ఎవరివైపు మొగ్గు చూపితే వాళ్లే అందలమెక్కే చాన్సుందని అంటున్నారు.

# ఆరు గ్యారెంటీలని.. అర గ్యారెంటీ అమలు

**సర్పంచ్ ఎన్నికల్లో ఎక్కడిక్కడ నిలదీయండి**

**బాకీలు అడిగినట్లుగా కాంగ్రెస్ నేతలను అడగండి**

**తులం బంగారం సహా హామీలపై ప్రశ్నించండి**

**చేవెళ్లలో ఉప ఎన్నిక రావడం ఖాయం**

**హామీలను అమలు చేసేదాకా నిలదీస్తూనే ఉంటా**

**షాబాద్ బిఆర్ఎస్ రైతు ధర్నా సభలో కెటిఆర్**



**రంగారెడ్డి,(క్రైమ్ మిర్రర్):** కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారెంటీలని చెప్పి.. అర గ్యారెంటీ మాత్రమే అమలు చేశారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. కేవలం ఉచిత బస్సు ప్రయాణంతో సరిపెట్టారని ఆరోపించారు. చేవెళ్ల నియోజకవర్గం షాబాద్‌లో నిర్వహించిన రైతు దీక్షలో ఆయన ప్రసంగించారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామన్నారు. ఈ రాష్ట్రంలో ఉన్న 1.67 కోట్ల మంది ఆడబిడ్డలకు ఒక్కొక్కరికి నెలకు రూ.2,500 చొప్పున రూ.30వేలు సీఎం రేవంత్‌రెడ్డి బాకీ ఉన్నారు. ఒక్కో రైతుకు ఎకరానికి రూ.17,500 బాకీ పడ్డారు. రైతులందరికీ రుణమాఫీ చేశామని నిరూపిస్తే రాజీనామా చేస్తా. గతంలో రైతుబంధుకు అడ్డుగా పిటిషన్ వేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు వచ్చిన కాంగ్రెస్ నేతలను ఎక్కడికక్కడ మహిళలు, రైతులు నిలదీయాలని ఈ సందర్భంగా కెటిఆర్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రుణమాఫీ వంద శాతం పూర్తయిందని నిరూపిస్తే.. నేను, మా ఎమ్మెల్యేలంతా రాజీనామా చేస్తాం' అంటూ సవాల్ విసిరారు. ఆరు గ్యారెంటీలు ఇచ్చి.. అర గ్యారెంటీ మాత్రమే అమలు చేస్తున్నారన్నారు. కేవలం ఫ్రీ బస్సుతో సరిపెట్టారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలను రైతులు నిలదీయాలన్నారు. రైతు భరోసా రూ.15 వేలు ఇస్తామని చెప్పి.. మోసం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రతి మహిళకు రేవంత్ రూ.30 వేలు బాకీ పడ్డారని.. రూ.30 వేలు ఇస్తేనే ఓటేస్తామని మహిళలు నిలదీయాలని మాజీ మంత్రి అన్నారు. ఎన్నికలప్పుడు రూ.7600 కోట్లు రైతుబంధు వేసేందుకు తాము సిద్ధమైతే ఈసీకి లేఖ రాసి రైతు బంధును వేయనీయకుండా అడ్డుకున్నారన్నారు. యాసంగి పంట సమయంలో రైతుల కోసం రూ.7600 కోట్లు పెడితే.. రేవంత్ ప్రభుత్వం వచ్చాక నాట్లు వేసే సమయంలో కాకుండా.. పార్లమెంటు ఎన్నికల సమయంలో ఓట్ల కోసం రైతుల ఖాతాలో వేశారని విమర్శించారు. ఒక్కసారి మాత్రమే కేసీఆర్ ఇచ్చిన డబ్బులను రైతు భరోసా కింద వేశారని.. ఆ తరువాత రైతు భరోసా ముచ్చటే లేదన్నారు. ఖచ్చితంగా జనవరి 26న రైతులకు ఇస్తానన్న రైతు భరోసాను ఇవ్వాల్సిందే అని స్పష్టం చేశారు. అది కూడా రూ.12 వేలు కాదు.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.15 వేలను రైతుల ఖాతాలో జమ చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. వానాకాలం పంటకు ఎగ్గొట్టిన రైతు బంధును కూడా రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు ఓటేయమని అడిగితే.. ముందు బాకీ తీర్చాకే ఓటు వేస్తామని గట్టిగా చెప్పాలని రైతులకు చెప్పారు. రైతులకు ఎకరానికి రూ.17500 బాకీ ఉంటే.. మహిళలకు సంవత్సరానికి రూ.30 వేల మేర రేవంత్ రెడ్డి బాకీ ఉన్నారని తెలిపారు. రేవంత్ రెడ్డి పచ్చి మోసగాడు అంటూ కేటీఆర్ తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేశారు. 37 రోజులు కాదు దమ్ముంటే 370 రోజులు జైల్లో పెట్టుకో.. భయపడేటోడు ఎవడూ లేడు అని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ తేల్చిచెప్పారు. కానీ ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకో. నిలబెట్టుకోకపోతే వెంటాడుతాం.. అడుగూతనే ఉంటాం. పేదల తరపున కొట్లాడుతూనే ఉంటాం అని కేటీఆర్ స్పష్టం చేశారు. సర్పంచ్, జడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెసోళ్లు వస్తారు.. చేయి గుర్తుకు ఓటేయండి అని అడుగుతారు. మీ సీఎం రైతుభరోసా కింద ఎకరానికి 17500 చొప్పున బాకీ ఉన్నాడు.. ఆ డబ్బులు చెల్లిస్తే ఓట్లు వేస్తామని చెప్పండి. బాకీ ఉన్నోన్ని అడిగినట్టు గల్లా పట్టుకుని అడగాలి.. అభయ హస్తం భస్మాసుర హస్తం అయిపోందని నిలదీయాలని ఆడబిడ్డలకు, రైతులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని మహిళలకు చిలుకకు చెప్పినట్టు చెప్పిండు కేసీఆర్. కాంగ్రెసోళ్లను నమ్మకండి అని చెప్పిండు. నెలకు 2500 పడ్డాయా..? 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు అయ్యాయా.? సర్పంచ్ ఎన్నికలప్పుడు వేస్తడు.. మళ్లీ నాలుగేండ్ల వరకు కనిపించడు. కాబట్టి రైతుబీమా, రైతు రుణమాఫీ, రైతు భరోసా ఎక్కడ అని నిలదీయండని రైతులకు, ఆడబిడ్డలకు కేటీఆర్ సూచించారు. ఈ ఏడాది కాలంలో నాలుగైదు లక్షల లగ్గాలు అయ్యాయి. రేవంత్ రెడ్డికి తులం బంగారం దొరకతలేదా ..? బంగారం షాపుడో నిన్ను నమ్మడం లేదా..? పెళ్ళైన ఆడబిడ్డలకు 80 వేల చొప్పున బాకీ ఉన్నాడు. సిలిండర్ ఫ్రీగా వస్తలేదు. కరెంట్ 200 యూనిట్ల ఫ్రీగా ఇవ్వడం లేదు. పచ్చి మోసగాడు.. పచ్చి అబద్దాల కోరు సీఎం రేవంత్.. 420 కేసు పెట్టాలంటే రేవంత్ రెడ్డి మీద చీటింగ్ కేసు పెట్టాలి. మనం కేసులు పెట్టినా.. పోలీసులు దరఖాస్తు తీసుకోవడం లేదు. రేవంత్ రెడ్డి భయం పట్టుకుంది వాళ్లకు. అందుకే ఓట్లప్పుడే రేవంత్ రెడ్డికి చురుకు పెట్టాలని కేటీఆర్ చెప్పారు. చేవెళ్ల నియోజకవర్గంలో త్వరలోనే ఉప ఎన్నిక రాబోతుందని కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉప ఎన్నికలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసాలను రైతులు, ఆడబిడ్డలు ఎండగట్టాలని కేటీఆర్ సూచించారు. కేసీఆర్‌కు ఓటేయడంతో ఇక్కడున్న ఎమ్మెల్యే గెలిచిండు. ఇప్పుడు రేవంత్ రెడ్డి సంకలో జొచ్చిండు. అభివృద్ధి కోసం పోయాను అని అంటుండు. ఈ ఏడాదిలో ఏం అభివృద్ధి జరిగింది..? రైతుబంధు, రుణమాఫీ, రైతుబీమా అమలైందా..? ఆడబిడ్డలకు తులం బంగారం, స్కూటీ ఇచ్చావా..? ఏం అభివృద్ధి అయింది.. ఉన్నది పీకింది. ఎన్నికలు వచ్చినప్పుడు చేవెళ్లలోనే కాదు.. పార్టీ మారిన ఎమ్మెల్యేల 10 నియోజకవర్గాల్లో బుద్ధి చెబుదాం. రైతు భరోసా వేయనందుకు, వానాకాలం రైతుబంధు ఎగ్గొట్టినందుకు, రుణమాఫీ మోసం చేసిందుకు, ఆడబిడ్డలకు రూ. 2500 ఇవ్వనందుకు, మా భూమి మాకే ఉండాలన్న పాపానికి 40 మంది రైతులను జైల్లో పెట్టి హింసించినందుకు.. కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుదాం. చివరకు వృద్ధులను కూడా మోసం చేసిండు. ఆసరా పెన్షన్లు 4 వేలు ఇవ్వడం లేదు అని కేటీఆర్ ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి నోటికి హద్దు లేదు. మందికి పుట్టిన బిడ్డలను మా బిడ్డలు అని చెప్పుకుంటుండు. కేసీఆర్ ఇచ్చిన 44 వేల ఉద్యోగాలను నేను ఇచ్చిన అని చెప్పుకుంటూ మోసం చేస్తున్నాడు. ఇవాళ షాబాద్‌లో జరిగిన ధర్నా మొట్టమొదటి.. మిగతా చోట్ల కూడా ధర్నా చేస్తాం. 70 లక్షల మంది రైతుల పక్షాన, 22 లక్షల మంది కౌలు రైతుల పక్షాన, భూమి లేని నిరుపేదల పక్షాన అడుగుతున్నాం.. ఇచ్చిన మాట నిలబెట్టుకో.. అందరికీ రైతుభరోసా జమ చేయ్.. లేదంటే రేపు పంచాయతీ ఎన్నికల్లో నీ వీపు చింతపండు చేస్తారు మా ఆడబిడ్డలు, రైతులు. ఇది ఆరంభం మాత్రమే.. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడతూనే ఉంటాం.. ఎన్ని కేసులు పెట్టినా.. జైళ్లకు పంపించినా రైతుల పక్షాన పోరాడుతూనే ఉంటామని కేటీఆర్ తేల్చిచెప్పారు. ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, భారాస నేతలు శ్రీనివాస్‌గౌడ్, పట్నం నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాత రేషన్ కార్డులు తొలగించడం లేదు

**కొత్త కార్డులను 26 నుంచి ఇవ్వబోతున్నాం**

**విపక్షాల దుష్ప్రచారం నమ్మకండి**

**మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టీకరణ**

**కరీంనగర్, (క్రైమ్ మిర్రర్):** పాత రేషన్ కార్డులు తొలగిస్తారనే ప్రచారం అబద్ధమని, అలాంటివి నమ్మవద్దని రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ నెల26 నుండి కొత్త రేషన్ కార్డులు ఇచ్చే పక్రియ కోసం గ్రామాల్లో సర్వే జరుగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 2 కోట్ల 81 లక్షల మందికి ఇప్పటికే తెలంగాణలో 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని, పాత రేషన్ కార్డులు తొలగించడం లేదని స్పష్టం చేశారు. అర్హత ఉండి కొత్త రేషన్ కార్డులు రాని వారికి జనవరి 26 నుండి కొత్త కార్డులు ప్రభుత్వం ఇస్తుందని, ప్రతిపక్షాలు కావాలని రాజకీయం చేసి రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. రేషన్ కార్డు అర్హత ఉండి రాకుంటే.. సంబంధిత అధికారికి, ప్రజాప్రతినిధులకు విజ్ఞాపన పత్రాలు ఇవ్వచ్చని మంత్రి పొన్నం చెప్పారు. కరీంనగర్ జిల్లా చిగురు మామిడి మండలం ఇందుర్తి మండలంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ? 'జనవరి 26 నుండి కొత్త రేషన్ కార్డులు ఇచ్చే పక్రియ కోసం గ్రామాల్లో సర్వే జరుగుతుంది. తెలంగాణ ప్రజలకు కొన్ని అంశాలు చెప్పే ప్రయత్నం చేస్తున్నా. 2 కోట్ల 81 లక్షల మందికి ఇప్పటికే తెలంగాణలో 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. ఇప్పుడు పాత 90 లక్షల రేషన్ కార్డులు చర్చ కాదు. గత 10 సంవత్సరాలుగా రేషన్ కార్డులు లేకుండా, కొత్తగా పెళ్లి అయిన వారికి, కొత్త కుటుంబాలు, మార్పులు చేర్పులు, అర్హత ఉండి కొత్త రేషన్ కార్డులు రాని వారికి శుభవార్త చెబుతున్నా. అర్హత ఉన్న వారికి జనవరి 26 నుండి రేషన్ కార్డులు ఈ ప్రభుత్వం ఇస్తుంది. ప్రతిపక్షాలు కావాలని రాజకీయం చేసి రాద్ధాంతం చేస్తున్నాయి. రేషన్ కార్డు అర్హత ఉండి రాకుంటే సంబంధిత అధికారి, ప్రజా ప్రతినిధులకు విజ్ఞాపన పత్రాలు ఇవ్వవచ్చని తెలిపారు. 'పాత రేషన్ కార్డులు తొలగించడం లేదు. ఇందులో ఎలాంటి అనుమానం లేదు. ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే నమ్మవద్దు. కుల సర్వే ఆధారంగా అప్లికేషన్ల సమాచారంతో కొత్త రేషన్ కార్డులు వస్తున్నాయి. ఇందుర్తిలో 71 కొత్త రేషన్ కార్డులు వచ్చాయి. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు వస్తున్నాయి. 2 లక్షల లోపు రైతు రుణమాఫీ చేశాం. రైతు భరోసా 12 వేలు ఇస్తున్నాం. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా ఇస్తున్నాం. భూమి లేని రైతు కూలీలకు 12 వేలు ఇస్తున్నాం. ఇందుర్తి మండల ప్రతిపాదనలు పంపాం. రాష్ట్రంలో కొత్త మండలాలు ఏర్పడినప్పుడు ఇందుర్తి మండలం ఏర్పడుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. కాగా.. ఆరు గ్యారెంటీలను రేవంత్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తుంది. ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇప్పటికే పలు హామీలను రేవంత్ ప్రభుత్వం అమలు చేసింది.



ఈ మేరకు రేషన్ కార్డులపై రేవంత్ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. కొత్త రేషన్ కార్డులను ఈ నెల26 నుంచి జారీ చేస్తున్నట్లు ప్రకటించింది. కులగణన సర్వే ఆధారంగా తయారు చేసిన రేషన్ కార్డులు లేని కుటుంబాల జాబితాను జిల్లా కలెక్టర్లతోపాటు జీహెచ్ఎంసీ కమిషనర్‌కు క్షేత్రస్థాయి పరిశీలన కోసం పంపనుంది. మండల స్థాయిలో ఎంపీడీఓతోపాటు యూఎల్‌బీలో మున్సిపల్ కమిషనర్ ఈ మొత్తం పక్రియకు బాధ్యులుగా చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లేదా జీసీఎస్ఓ పర్యవేక్షకులుగా ఉండేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

## ఎడిటోరియల్



ఈడీ విచారణకు ముందు ఫార్ములా కేసుపై మాజీ మంత్రి కెటిఆర్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టార్గెట్‌గా సంచలన కామెంట్స్ చేశారు. ఫార్ములా-ఈని తెలంగాణకు తీసుకువచ్చి ప్రపంచ పటంలో హైదరాబాద్ నగరాన్ని నిలపడం మంత్రిగా తాను తీసుకున్న గొప్ప నిర్ణయాల్లో ఒకటిగా నిలుస్తుందన్నారు. ఈ రేసు సందర్భంగా అంతర్జాతీయ రేసర్లు, ఈ- మొబిలిటీ రంగానికి చెందిన ప్రముఖులు హైదరాబాద్ నగరాన్ని ప్రశంసలతో ముంచెత్తడం జరిగిందని గుర్తుచేశారు. ఎన్ని రకాల చిల్లర కేసులు, బురదజల్లే కార్యక్రమాలు, రాజకీయ వేధింపులకు పాల్పడినా ఈ రేసు ద్వారా సాధించిన విజయాలను తగ్గించలేవని తెలిపారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం ఈడీ విచారణకు హాజరయ్యారు. ఫార్ములా ఈ కార్ రేసు కేసులో కేటీఆర్‌ను ఈడీ అధికారులు ప్రశ్నించనున్నారు. ఉదయం 10:30 గంటలకు ఈడీ ముందు విచారణకు హాజరుకానున్న సందర్భంగా కేటీఆర్ ఎక్స్ వేదికగా ఈ కామెంట్స్ చేశారు. మంత్రిగా ఉన్నా లేకున్నా బ్రాండ్ హైదరాబాద్‌ను పెంపొందించడమే ఎల్లవేళలా ముఖ్యమైన అంశంగా తాను భావిస్తానని వెల్లడించారు. ఫార్ములా - ఈ రేసు హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ క్రీడా పటంలో నిలిపిందని చెప్పుకొచ్చారు. ఇలాంటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించేందుకు విజన్, నిబద్ధత, హైదరాబాద్ నగరం అంటే అమితమైన ప్రేమ ఉండాలని.. అందుకే ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నానన్నారు. ాష్ట్ర ప్రభుత్వం పంపిన 46 కోట్ల రూపాయల డబ్బులు ఫార్ములా-ఈ సంస్థకు అత్యంత పారదర్శకంగా బదిలీ చేయడం జరిగిందని తెలిపారు. కేవలం బ్యాంక్ లావాదేవీగా స్పష్టమైన రికార్డు

# పాతపాటే పాడిన మాజీమంత్రి కెటిఆర్

ఉందన్నారు. ఒక్క రూపాయి కూడా వృధా కాలేదని, ప్రతీనయా పైసాకు లెక్క ఉందని స్పష్టం చేశారు. మరి అలాంటప్పుడు ఇందులో అవినీతి, మనీలాండరింగ్ ఎక్కడ ఉందని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న అసంబద్ధమైన రేసు రద్దు నిర్ణయం వల్లనే రాష్ట్ర ఖజానాకు నష్టం వాటిల్లిందని అన్నారు. ఎలాంటి తప్పు లేకున్నా కేవలం రాజకీయ వేధింపుల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం కోర్టు, కేసులు, విచారణల పేరుతో ఈ అంశాన్ని లాగుతోందని మండిపడ్డారు. కచ్చితంగా ఈ అంశంలో నిజమే గెలుస్తుందని... ఇదే అంశాన్ని రాష్ట్ర ప్రజలు, కోర్టులు కూడా త్వరలో తెలుసుకుంటాయన్నారు. అప్పటిదాకా న్యాయం కోసం తమ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని స్పష్టం చేస్తూ కేటీఆర్ ట్వీట్ చేశారు. ఇదిలావుంటే ఫార్ములా ఈ కార్ రేస్ వ్యవహారానికి సంబంధించి కేటీఆర్ గురువారం ఉదయం ఈడీ విచారణకు హాజరయ్యారు. గచ్చిబౌలిలోని ఆయన నివాసం నుంచి బయలుదేరి నేరుగా ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలోనే బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయం ముందు భారీ బందోబస్తు చేపట్టారు. దాదాపు 200 మంది పోలీసులు అక్కడ మోహరించారు. అటు, ఈడీ కార్యాలయం వద్ద అధిక సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు చేరుకోగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం జరిగి తోపులాట చోటు చేసుకుంది. దీంతో అక్కడి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఫార్ములా ఈ రేస్‌లో వ్యవహారానికి సంబంధించి ఏసీబీ దర్యాప్తు చేస్తుండగా.. ఇందులో ఆర్బీఐ అనుమతి లేకుండా విదేశీ సంస్థకు నిదుల చెల్లింపుపై ఈడీ మరో కేసు నమోదు చేసింది. ఇదే కేసులో ఇప్పటికే అప్పటి పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిలను ఈడీ విచారించింది. కాగా.. ఏసీబీ తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలని కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించగా.. ఈ నిర్ణయాన్ని ఆయన సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. అయితే, ఈ పిటిషన్‌ను సైతం సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. 'డిస్మిస్డ్ యూజ్ విత్‌డ్రాన్'గా ప్రకటిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. హెచ్ఎండీఏ ఖాతా నుంచి విదేశీ సంస్థకు నిధుల బదిలీపై ఈడీ అధికారులు ఆరా తీస్తున్నారు. విదేశీ సంస్థకు రూ.45.7 కోట్ల బదిలీ వ్యవహారంపై కేటీఆర్‌ను ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఇప్పటికే అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఈడీ అధికారులు విచారిస్తున్నారు. కాగా, ఈడీ విచారణకు హాజరయ్యే ముందు ట్విట్టర్ వేదికగా కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెడుతున్న కేసులు ఘనతను తుడిచేయలేవని అన్నారు. 'హైదరాబాద్‌లో ఫార్ములా ఈ రేస్ నిర్వహణ అనేది మంత్రిగా తాను తీసుకున్న నిర్ణయాల్లో ఒకటి. ఆనాడు రేసర్లు అంతా హైదరాబాద్ నగరాన్ని కీర్తించారు. ఎలాంటి అవినీతి జరగకున్నా కేసులు, కోర్టులంటూ రాజకీయ వేధింపులకు గురి చేస్తున్నారు.

భోజన ప్రియులు పెరిగారు. ఇంటివంటకన్నా బయట బిర్యానీలు, కరీలకు ప్రాముఖ్యం పెరిగింది. అలాగే కరీపాయింట్స్ పెరిగాయి. రుచికరమైన హోటళ్లు..అమ్మచేతి వంట అంటూ ప్రచారం సాగిస్తున్నాయి. కానీ ఇలాంటి అనేక హోటళ్లలో పరిశుభ్రత డొల్ల అని ఇటీవల అధికారుల వరుస దాడలతో బట్టబయలు అయ్యింది. పరిశుభ్రత, నాణ్యత అన్నవి పక్కకు పోయాయి. ప్రపంచవ్యాప్తంగా మాంసాహార ప్రియులే ఎక్కువగా ఉంటారు. శాఖాహారం కన్నా మాంసాహారాన్నే చాలా మంది ఇష్టంగా ఆరగిస్తుంటారు.



# కలవర పెడుతున్న కల్తీ ఆహారం !

ఆదివారం వచ్చిందంటే చాలు చికెన్ లేదా మటన్ తెచ్చుకోవాల్సిందే. అమ్మ లేదా భార్యతో రుచికరంగా వండించుకుని తినాల్సిందే. ఇటీవల కాలంలో హోటళ్లు విపరీతంగా పెరిగిపోయాయి. స్విగ్గీ, జొమాటో వంటి ఆన్ లైన్ ఎ÷-లాట్ ఫామ్స్ వచ్చిన తర్వాత ప్రతి రోజూ నాన్ వెజ్ తినే వారి సంఖ్య బాగా పెరిగిపోతోంది. ఒక్క క్లిక్‌తో బిర్యానీ ఇంటి ముందుకే రావడంతో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఆర్డర్ పెట్టుకుని తినేస్తున్నారు. అయినా ఆదివారం రోజును అంతా ఎంతో ప్రత్యేకంగా భావిస్తారు. ఆ రోజు ఇంట్లో కచ్చితంగా నాన్ వెజ్ ఉడకాల్సిందే. లేదంటే ఏదో వెలితిగా అనిపిస్తుంటుంది. రోజు కచ్చితంగా నాన్ వెజ్ తినాల్సిందే అనే విధంగా పరిస్థితి తయారయ్యింది. ఇదే అదనుగా అనేకులు హోల్ బిజినెస్ రంగంలోకి దిగారు. రుచికరమైన, శుచికరమైన వంట అంటూ ప్రకటనలు గుప్పిస్తున్నారు. కానీ బొద్దింకలు, వెంట్రుకుల, మేకులు, జెర్రీలు ఇలా ఒకటేమిటి రకరకాల వస్తువులు , ప్రాణులు బిర్యానీల్లో దర్శనమిస్తున్నాయి. మాంసాహార ప్రియులకు ఆదివారం ప్రత్యేకమైన రోజు. చాలా దేశాల ప్రభుత్వాలు, ప్రైవేటు సంస్థలు స్థానిక చట్టాల ప్రకారం తమ ఉద్యోగులకు వారానికి ఓ రోజు ఇవ్వాల్సిన సెలవు దినాన్ని ఆదివారంగా ఎంచుకున్నారు. వారం మొత్తం కష్టపడి పని చేసిన ఉద్యోగులు తీవ్రమైన పని ఒత్తిడి, శరీర అలసటతో ఉంటారు. ఆ ఒక్కరోజు మాత్రం కుటుంబసభ్యులతో ఆనందంగా గడుపుతుంటారు. అయితే మానవజాతి ఆవిర్భావం నుంచి నాన్ వెజ్ తినడానికే మనిషి ఎక్కువగా ఇష్టపడుతుంటాడు. అయితే ఆదివారం రోజున తమ కుటుంబసభ్యులతో కలిసి సరదాగా గడిపే సమయంలో మాంసాహారం ఉంటే ఇంక ఆ మజానే వేరుగా ఉంటుంది. అందుకే ఆదివారం రోజున చికెన్, మటన్, చేప వంటి మాంసాహారాలు తినేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తుంటారు. అలాగే పిల్లలు కూడా పాఠశాలలు, కళాశాలలకు వెళ్తూ వారం మొత్తం బిజీబిజీగా ఉంటారు. ఆ ఒక్కరోజే ఇంటి వద్ద ఉంటారు. అందుకే ఈ రోజున నాన్ వెజ్ తినేందుకు ఎక్కువగా మంది మొగ్గు చూపుతుంటారు. ఈ క్రమంలో ఆదివారాలు హోటళ్లకు గిరాకీ పెరుగుతోంది. సంప్రదాయమే కాలక్రమేనా సంస్కృతిగా మారి పోయింది. ఆదివారం మాంసాహారం తినని కుటుంబం అంటూ ఉండదు. దాదాపు ప్రతిఒక్కరూ ముక్క లేనిదే ముద్ద దిగదు అన్నట్లు ఆదివారాన్ని ప్రత్యేకంగా చూస్తారు. ఆ రోజు నాన్ వెజ్ తీసుకురాకపోతే పిల్లలు పెద్ద యుద్ధమే చేస్తుంటారు. దీంతో ఆదివారం నాన్ వెజ్ తినడం తప్పని సరిగా మారిపోయింది. అందుకే ఆదివారం నాడు చికెన్, మటన్ షాపుల ముందు ప్రజలు పెద్దఎత్తున బారులు తీరుతుంటారు. అదేరీతిలో హోటళ్లు కూడా కిక్కిరిసి పోతున్నాయి. ముందే ఆర్డర్ ఇవ్వడం, రిజర్వ్ చేసుకోవడం తప్పనిసరిగా మారింది. అయితే ఎంతో పేరు ప్రఖ్యాతులు ఉన్న హోటళ్లు కూడా శుచి, శుభ్రత, నాణ్యత విషయంలో డొల్ల అని తేలింది. వారి కిచెన్‌లను పరిశీలించినప్పుడు పాచిపోయిన, కాలం చెల్లిన పదార్థాలు దర్శనం ఇస్తున్నాయి. హోటళ్లు, ఫుట్‌పాత్‌లపై నోరూరించే, ఘుమ ఘుమలాడే వంటకాల వెనక అనేక నాసిరకం ఆహార పదార్థాలు దాగి ఉంటున్నాయి. కనీస ప్రమాణాలు పాటించకుండా మాంసాహారాన్ని నిల్వ ఉంచుతున్నారు. వాటికే రంగులద్ది మళ్లీ మళ్లీ నూనెలో వేయించి,వేడివేడిగా పొగలు కక్కిస్తూ వడ్డిస్తున్నారు.

పలు చోట్ల రోగాల బారిన పడిన జంతువుల మాంసాన్ని సైతం వినియోగించిన ఘటనలు వెలుగు చూశాయి. నాసిరకం నూనెలు, అనుమతి లేని రంగులను మితిమీరి వాడుతున్నారు. కల్తీ ఆహారం వల్ల అతిసారం నుంచి క్యాన్సర్ల వరకు దాదాపు 200 రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు హెచ్చరి స్తున్నారు. గుండె, ఊపిరితిత్తులు, నరాలు, ఎముకలు, మూత్రపిండాలు, మెదడు, చర్మ సంబంధిత సమస్యలు వస్తాయని పేర్కొంటున్నారు. ఆహార పదార్థాల తయారీలో రుచి, రంగు కోసం హానికరమైన రసాయనాలు, రంగులను కలుపుతుండడంతో దేశంలో సుమారు 10 కోట్ల మంది వివిధ వ్యాధులతో బాధ పడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. 2030 నాటికి ఈ సంఖ్య 15 కోట్లకు చేరుతుందని అంచనా వేసింది. వంట నూనెల నియంత్రణ చట్టం-1947, నిత్యావసర సరకుల నియంత్రణ చట్టం-1955, పాల ఉత్పత్తుల నియంత్రణ చట్టం-1992 వంటివి క్షేత్ర స్థాయిలో సక్రమంగా అమలుకు నోచుకోవడంలేదు. ఆహారం కల్తీ చేయటం, నాసిరకం పదార్థాలు అమ్మటం నేరమని ఆహార భద్రతా ప్రమాణాల చట్టం-2006 చెబుతున్నది. ఆహార కల్తీ నిరోధక చట్టం-1954 కఠిన శిక్షలను నిర్దేశించింది. ఆహార, పానీయాలను కల్తీ చేసి అమ్మేవారికి ఆరు నెలల తప్పనిసరి జైలు శిక్షతో పాటు రూ.25 వేల జరిమానా విధించాలని పార్లమెంటరీ ప్యానెల్ సైతం ఏడాది క్రితం సిఫారసు చేసింది. అయితే హోటళ్లు, రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేస్తూ.. కలుషిత ఆహారాన్ని గుర్తిస్తున్నా.. వారికి శిక్షలు మాత్రం పడడం లేదు. జరిమానాలతో బయటికొచ్చి మళ్లీ అదే వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ యాక్ట్ ప్రకారం నాసిరకం ఆహారం అని తేలితే జాయింట్ కలెక్టర్ సమక్షంలో నేరస్తుడిని ప్రవేశపెట్టి జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష వేసే అవకాశం ఉంది. సబ్ స్టాండర్డ్ కేసుల్లో రూ.వెయ్యి నుంచి రూ.2 లక్షల వరకూ జరిమానా చెల్లించి నేరస్తులు బయట పడుతున్నారు. కల్తీ ఆహారం అని తేలితే క్రిమినల్ కేసు బుక్ చేయాలి. వారికి గరిష్టంగా రెండేళ్ల జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. ఒకవేళ కల్తీ ఆహారం తిని ఎవరైనా చనిపోయినట్లు నిరూపించగలిగితే గరిష్టంగా ఏడేళ్ల శిక్ష విధించేందుకు చట్టంలో సెక్షన్లున్నాయి. ఇన్ని శిక్షలున్నా కల్తీ నిరా ఘాటంగా జరిగిపోతూనే వుంది. కల్తీ ఆహారానికి సంబంధించి ప్రభుత్వాలు కదలాలి. నిఘా పెరగాలి. తనిఖీ నిరంతరం కొనసాగాలి. కల్తీకి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి. ప్రజలలో సైతం చైతన్యం పెరగాలి. అప్పుడే ఈ కల్తీకి క్లళెం వేయగలం అని గుర్తించాలి. అందుకే భోజన ప్రియులు ఇవన్నీ గుర్తించి తినడం మంచిది. లేకుంటే లేని రోగాలను, క్యాన్సర్‌లను కొని తెచ్చుకోవడం జరుగుతుంది.



# ఆధ్యాత్మిక శోభతో అలరారుతున్న ప్రయాగ్‌రాజ్

భారీగా తరలివస్తున్న భక్తులతో త్రివేణి సంగమంలో ఆధ్యాత్మిక శోభ కొనసాగుతోంది. భక్తుల భజనలు, హర్ హర్ మహాదేవ్ నామస్మరణతో ప్రయాగ్‌రాజ్ మార్మోగుతోంది. మహాకుంభమేళాను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న యూపీ ప్రభుత్వం.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భారీ ఏర్పాట్లు చేసింది. ఈ సారి మహా కుంభమేళాకు 40కోట్ల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తోంది.ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళా మూడో రోజుకు చేరుకుంది. ఈ మహాకుంభమేళాకు తెల్లవారుజామునుంచే భక్తులు పోటెత్తుతున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ భక్త జనసంద్రాన్ని తలపిస్తోంది. మహాకుంభమేళాకు నాలుగోరోజు కూడా భక్తులు లక్షలాదిగా తరలివస్తున్నారు. త్రివేణి సంగమంలో భక్తుల పుణ్యస్నానాలు కొనసాగుతున్నాయి. నదీమతల్లికి హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారు.ప్రపంచంలోనే అతిపెద్ద మతపరమైన ఆధ్యాత్మిక పండుగ మహా కుంభ్ ఈసారి సంగం నగరం ప్రయాగ్‌రాజ్‌లో ఘనంగా నిర్వహిస్తున్నారు. లక్షలాది సంవత్సరాల క్రితం కుంభం నుండి జారిన అమృతాన్ని వెతుక్కుంటూ గంగా-యమునా, అదృశ్య సరస్వతి ఒడ్డుకు భక్తులు గుంపులు గుంపులుగా పెద్ద ఎత్తున తరలి వస్తారు. మకర సంక్రాంతి రోజున అంటే మంగళవారం నాడు 3.5 కోట్ల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సంఖ్య నిజంగా ఆశ్చర్యం కలిగిస్తుంది. ఎందుకంటే ప్రపంచంలోని 234 దేశాల్లో కేవలం 45 దేశాల్లో మాత్రమే 3.4 కోట్లకు పైగా జనాభా ఉంది. అంటే 189 దేశాల జనాభా కంటే పెద్ద జనసమూహం ఒకేసారి సామూహిక స్నానానికి సంగం నగరికి చేరుకుంది. ఇది దేవుని పట్ల ప్రజలకు ఉన్న నిజమైన విశ్వాసాన్ని తెలియజేస్తుంది. మకర సంక్రాంతి రోజున, భక్తులు గంగలో స్నానమాచరించిన వెంటనే, కుంభం నుండి అమృతం చిందినట్లు త్రివేణి సంగమం చుక్కలు చిమ్మడం ప్రారంభించాయి. వివిధ అఘోరాలకు చెందిన సాధువులు మంగళవారం మహాకుంభంలో మొదటి 'అమృత స్నాన్' తీసుకున్నారు. ఈ సందర్భంగా త్రివేణి సంగమం వద్ద జనం భారీగా తరలివచ్చారు. మహా కుంభ్‌లోని చాలా అఘోరాలకు బూడిద ధరించిన నాగ సాధువులు నాయకత్వం వహించారు. వారు తమ క్రమశిక్షణ, సాంప్రదాయ ఆయుధాలపై పట్టుతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. నైపుణ్యంతో ఈటెలు, కత్తులు పట్టుకోవడం నుండి ఉద్వేగభరితంగా డ్రమ్ములు వాయించడం వరకు, వారి ప్రదర్శనలు పురాతన సంప్రదాయాల ఉత్సాహభరితమైన వేడుక అని అధికారిక ప్రకటన తెలిపింది. మహాకుంభ్‌లో పురుష నాగ సాధువులే కాకుండా, పెద్ద సంఖ్యలో మహిళా నాగ సన్యాసులు కూడా అమృత స్నానం అచరించారు. మహా కుంభం మొదటి ప్రధాన స్నానం సోమవారం 'పౌష్ పూర్ణిమ' సందర్భంగా జరిగింది. అయితే అఘోరాలు, హిందూ మతాల సభ్యులు మకర సంక్రాంతి రోజున వారి మొదటి స్నానం చేశారు.శ్రీ పంచాయతీ అఘోరా మహానిర్వాణి, శ్రీ శంభు పంచాయతీ అటల్ అఘోరా మొదట 'అమృత స్నాన్' తీసుకున్నారు. మహాకుంభ్‌లో వేలాది మంది అఘోరాలు పాల్గొంటున్నారు. అమృత స్నాన్ సందర్భంగా హెలికాప్టర్ నుంచి భక్తులపై గులాబీ రేకుల వర్షం కురిపించారు. ప్రయాగ్‌రాజ్‌లో ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి పూర్ణ కుంభం నిర్వహిస్తారు. అయితే 12 పూర్ణ కుంభాల తర్వాత 144 సంవత్సరాలకు ఒకసారి మహాకుంభం జరుగుతుందని మహానిర్వాణి అఖారాకు చెందిన మహామండలేశ్వర చేతన్‌గిరి మహారాజ్ అన్నారు. ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొనడం భక్తులకు అరుదైన వరం. 68 మంది మహామండలేశ్వరులు, మహానిర్వాణి అఘోరాకు చెందిన వేలాది మంది సాధువులు అమృత స్నానంలో పాల్గొన్నారు.35 మంది మహామండలేశ్వరులు, నిరంజని అఘోరాకు చెందిన వేలాది మంది నాగ సాధువులు అమృత స్నాన్‌లో పాల్గొన్నారు. ఇది కాకుండా, జునా అఘోరా, ఆవాహన్ అఘోరా, పంచాగ్ని అఘోరాకు చెందిన వేలాది మంది సాధువులు కూడా అమృత్‌లో స్నానం చేశారు. ఆచార్య మహామండలేశ్వర్ స్వామి అవధేశానంద గిరి నేతృత్వంలోని కిన్నార్ అఘోరా సభ్యులు కూడా జునా అఘోరాతో పాటు పవిత్ర స్నానమాచరించారు. పెద్ద రథంలో ఘాట్ వద్దకు చేరుకున్న నాగ సాధువుల బృందం అనుసరించింది.నాగ సాధువులు ఈటెలు, త్రిశూలాలను ధరించి, వారి శరీరాలపై బూడిద పూసుకుని, కొన్ని గుర్రాలతో ఊరేగింపుగా రాజ స్నానానికి బయలుదేరారు. జుట్టులో పువ్వులు, మెడలో దండ, చేతిలో త్రిశూలంతో మహాకుంభానికి ఆధ్యాత్మిక వైభవాన్ని జోడించింది.

క్రైమ్ THE మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శనివారం 18-1-2025


# భూభారతితో ప్రతి ఎకరాకు భద్రత

**ధరణి పోర్టల్తో అర్హులైన రైతులకు అన్యాయం**

**నేడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన భూభారతితో ప్రతి ఒక్కరికి న్యాయం**

**ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



**వనపర్తి క్రైమ్ మిర్రర్ ప్రతినిధి:** గ్రామాలలో నెలకొన్నభూ సమస్యలన్నింటిని పరిష్కరించుకుందామని రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి నేడు భూభారతి రూపొందించిందని సమస్యలున్న ప్రతి ఒక్కరు స్థానిక తహసిల్దార్ కార్యాలయాలకు వెళ్లి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమస్యలను పరిష్కరించుకోవచ్చునని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు ఖిల్లా ఘణపురం మండలం ఎన్కి తండాలో శుక్రవారం నూతన అంగన్వాడి భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శుక్రవారం శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 40,000వేల కోట్ల రూపాయల ఖర్చుతో చేపట్టిన మిషన్ భగీరథ పనుల ద్వారా గ్రామాలలో ఇప్పటికీ తాగునీటి సమస్యలు ఉందని నేడు ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వనపర్తి నియోజకవర్గంలో తాగునీటి సమస్యల పరిష్కారం కోసం నేటికీ మూడు కోట్ల రూపాయల సొంత నిధులు ఖర్చు చేశానని ఎమ్మెల్యే పేర్కొన్నారు ఎనికి తాండాలో కొంతమంది రైతుల భూములను ధరణి లో ఉన్న లొసుగులను ఉపయోగించుకొని కొందరు' దళారులు సొంతం చేసుకుని ప్రభుత్వ డబ్బులను స్వాహా చేస్తున్నారని అలాంటి వారిపై చట్టపరమైన విచారణ చేపట్టి నిజమైన లబ్ధిదారులకు చెల్లింపులు చేస్తామని ఎమ్మెల్యే గ్రామస్తులకు హామీ ఇచ్చారు. నేటి ఇందిరమ్మ రాజ్యంలో అవినీతికి పాల్పడే వారిని తన్ని తరిమేయాలని ఎవరూ కూడా మీ మీ పనులు చేయించుకునేందుకు లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేగా నేను కాంగ్రెస్ ఎంపీగా మల్లు రవి కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని గ్రామస్థాయిలోనూ కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులే ప్రజా ప్రతినిధులు అయితేఅభివృద్ధిత్వత్వరగా జరుగుతుందని ప్రతి ఒక్కరూ స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి సభ్యులు సోలిపురం రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటయ్య, మాజీ ఎంపిటిసి సభ్యురాలు విజయలక్ష్మి, వెంకట్రావు, నాయకులు సాయిచరణ్ రెడ్డి, మాజీ సర్పంచ్ సతీష్,ప్రకాష్, క్యామరాజు విజయ్ కుమార్ రాజు నాయక్ ఆర్య నాయక్ మండల నాయకులు కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## క్రీ.శే కర్నె శివలీల- జంగప్ప జ్ఞాపకార్థం,సంస్థాన్ నారాయణపుర్ గ్రామ ప్రజలకు ఉచిత ఫ్రీజర్ బాక్స్ సేవలు

**సంస్థాన్ నారాయణపుర్, జనవరి 17(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపుర్ గ్రామ ప్రజల కొరకు కీ.శే కర్నె శివలీల జంగప్ప జ్ఞాపకార్థంగా మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ రూ.60 వేల రూపాయల విలువైన ఫ్రీజర్ బాక్స్ ను గ్రామానికి చెందిన శిరీష పౌండేషన్ నిర్వహకులు చెర్క కిరణ్ కుమార్ కి వితరణ చేశారు. అట్టి ఫ్రీజర్ బాక్స్ ను బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు,గ్రామస్తులతో కలిసి గ్రామ మాజీ సర్పంచ్ శికిలమెట్ల శ్రీహరి అందజేశారు. ఈ సందర్భంగా శిరీష ఫౌండేషన్ నిర్వాహకులు చెర్క కిరణ్ మాట్లాడుతూ మన గ్రామం కోసం ఏది అడిగినా అరక్షణం కూడా ఆలోచించకుండా సేవలందిస్తూన్న మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ కి గ్రామ ప్రజలందరూ ఎల్లప్పుడూ కృతజ్ఞతా భావంతో ఉంటారని తెలిపారు. ఫ్రీజర్ బాక్స్ ద్వారా గ్రామంలో మరణించిన ప్రతి నిరుపేద కుటుంబానికి పరోక్షంగా ఐదువేల రూపాయలను సహకరించినట్టేనని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు రాచకొండ రవి,శ్రీరాములు నర్సింహ్మా,పాశం కృష్ణ యాదవ్ గ్రామశాఖ అధ్యక్షులు తెలంగాణ బిక్షం,లారీ బిక్షం,గుండమల్ల సతీష్ కుమార్, ఉప్పల శ్రీను,ఎడ్ల సత్తయ్య,రాసాల వేంకటేష్ ,చిలువేరు శంకర్,పేరా రమేష్,చిలువేరు వెంకులు, అబ్బనగోని వంశీ, బకారం శ్రీను,చింతకింది ఉషామ్మ,చిలువేరు శేఖర్,లింగస్వామి, పాత్రికేయులు సోమన బోయిన కృష్ణ కుమార్, శికిలమెట్ల ప్రభాకర్, చింతకింది సుధాకర్, పౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## షాబాద్ జంగ్ సైరన్‌లో పాల్గొన్న మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ నాయకులు...



**గండిపేట్(క్రైం మిర్రర్):** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు కష్టాలు మొదలైయ్యాయని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సీతారం ధూళిపాళ అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సర్కార్ రైతులతో వ్యవహరిస్తున్న మోసపూరిత తీరుకు వ్యతిరేకంగా, రైతు వ్యతిరేక ధోరణి తలపెట్టిన సర్కారుకు నిలతీతగా బీఆర్ఎస్ పార్టీ తలపెట్టిన చేవెళ్ల నియోజకవర్గంలోని షాబాద్ రైతుల పక్షాన చేస్తున్న దీక్షలలో మణికొండ మున్సిపాలిటీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నెక్నాంపూర్ ప్రభుత్వ పాఠశాల వద్ద నుంచి ఏకీకృతమైన కలిసి కట్టుగా బయలుదేరి సంఘిభావం తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటిఆర్‌ను కలిసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభగల్ల ధనరాజ్, మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, గుట్టమీది నరేందర్, అందె లక్ష్మణ్‌రావు, ఉపేందర్ నాథ్ రెడ్డి, గౌరికంటి విఠల్, సంగం శ్రీకాంత్, మాల్యాద్రి నాయుడు, ఆరిఫ్ మొహమ్మద్, సుమనలిని, అన్ను, మంజు, రేఖ, అనూష, గీతా, హరి, తిరుపతి, రవిసాగర్, బుద్దోల్‌బాబు, దిలీప్, భాను, శ్రీనివాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.





## రేషన్‌కార్డుల వేరిఫికేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేస్తాం

**మణికొండ మున్సిపాలిటీ కమీషనర్ ప్రదీప్‌కుమార్**

**గండిపేట్(క్రైం మిర్రర్):** రేషన్‌కార్డుల వేరిఫికేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయడం జరుగుతుందని మణికొండ మున్సిపాలిటీ కమీషనర్ ప్రదీప్‌కుమార్ తెలిపారు. శుక్రవారం 8,9 వార్డుల్లో సిబ్బంది నిర్వహిస్తున్న రేషన్ కార్డుల వేరిఫికేషన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అర్హుల వద్దకు వెళ్లి వివరాలను నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్,అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కొత్త రేషన్ కార్డుల లబ్ధిదారుల సర్వేను పరిశీలించిన కమీషనర్ శరత్‌చంద్ర...





**గండిపేట్(క్రైం మిర్రర్):** కొత్త రేషన్ కార్డుల లబ్ధిదారుల సర్వే ప్రక్రియను పరిశీలించి అధికారులు, సిబ్బందికి సరైన సూచనలు అందిస్తున్నట్లు బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. శుక్రవారం ఉదయం కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్‌లోని సౌభాగ్యనగర్ కాలనీ, 13వ డివిజన్‌లోని హిమగిరినగర్ కాలనీ, 14వ డివిజన్‌లోని ఇందిరారెడ్డినగర్ కాలనీ, 15వ డివిజన్‌లోని శాంతినగర్ కాలనీ, 16వ డివిజన్‌లోని లక్ష్మినగర్ కాలనీ, 21వ డివిజన్‌లోని వికాస్ నగర కాలనీలలో ఆయన పర్యటించి సర్వే ప్రక్రియను పరిశీలించారు. ధరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి ప్రభుత్వ నియమనిబంధనల ప్రకారం సర్వే చేసి లబ్ధిదారులను గుర్తించాలని ఫీల్డ్ వేరిఫికేషన్ ఆఫీసర్లకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ములం వద్దే చెత్తను వేరు చేయాలి-కమీషనర్ శరత్‌చంద్ర

**గండిపేట్(క్రైం మిర్రర్):** ప్రతి రోజు ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులకు తమ ఇంట్లోని చెత్తను అందించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. శుక్రవారం కార్పొరేషన్ పరిధిలోని 19వ డివిజన్ ఇందిరారెడ్డినగర్ కాలనీ, 20వ డివిజన్‌లోని డాన్ బాస్కోనగర్ కాలనీలో డోర్ టూ డోర్ చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. తడి, పొడి, హానికర చెత్తను వేరు చేసి స్వేచ్ఛ ఆటోలకు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ జవాన్లు సుభాష్, నవీన్, శ్రీధర్, రాము తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా చెన్నకేశవ స్వామి జాతర

**చేవెళ్ల (క్రైమ్ మిర్రర్):** మొయినాబాద్ మండలం మోత్కుపల్లి గ్రామంలో చెన్నకేశవ స్వామి జాతర అంబరాన్ని తాకింది. భక్తుల కోలహలం మధ్య జాతర సంబరం వైభవంగా జరిగింది. చెన్నకేశవ స్వామి వారిని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొంపల్లి అనంత్ రెడ్డి,మండల ఎంపీటీసిల సంఘం మాజీ ఫోరమ్ అధ్యక్షుడు మోర శ్రీనివాస్,కేతిరెడ్డిపల్లి వెంకట్ రెడ్డి,మోత్కుపల్లి గ్రామ మాజీ సర్పంచ్ రాంచందర్(రత్నం)తో కలిసి దర్శించుకున్నారు.

## పేరుకే... వాట్సాప్ మీడియా గ్రూపులు...?

**రిపోర్టర్లకి సమాచారం ఇవ్వని అధికారులు ఏం జరుగుతుందని తెలియజేసే మీడియా వద్దా ?**

**సంస్థాన్ లో ప్రశ్నించే పత్రికలకు ప్రశ్నగా మారింది**





**సంస్థాన్ నారాయణపుర్,జనవరి 17 (క్రైమ్ మిర్రర్ ):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపుర్ మండలలోని ప్రభుత్వ కార్యాలయలలో ఉన్నత అధి కారుల పర్యవేక్షణ కరువాయే సమయపాలన పాటి%శీ%చని అధికారులు గుట్టు చప్పుడు కాకుండా చేపడుతున్న పనులుపై అరా తీసేది ఎవరు..? ఏం జరుగుతోంది అని వివరించేది ఎవరనేది ప్రశ్నగా మారింది.. ప్రజలకు ప్రభుత్వానికి మధ్యలో వారధిగా మీడియా పనిచేస్తుంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలుప్రజలకు చేరవేయడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుంది అన్న విషయం అందరికి తెలిసిన విషయమే.. ప్రతి సమాచారాన్ని అధికారులు మీడియాకు చేరవేస్తారు.. నారాయణపుర్ మండలంలోమాత్రం ప్రతి ఒక్క మండల స్థాయి ప్రభుత్వ అధికారులు మాత్రం సమాచారం అందించడంలో నిర్ల క్ష్యం కొట్టొచ్చినట్లుగా కనిపి స్తుంది. జిల్లా స్థాయి అధికారులు మండలంలో పర్య టించిన సమయ%శీ%లో కూడా మీడియాకు సమచారం అందించకుండా తమ యొక్క నిర్లక్ష్య ధోరణిని చూపుతున్నట్లు కనిపిస్తుంది.. ఏఏ శాఖలో ఏ కార్యక్ర మాలు జరుగుతున్న విషయం అందరికి తెలియ పర్చడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం మూల%శీ%గా ప్రజలకు పూర్తి సమాచారం అందకుండా పోయి%శీ%ది. మండల అధికారులకు సంబం ధించి సంచారం తెలియపర్చడం కోసం మీడియా, అధికారులకు ఒక గ్రూప్ ఏర్పాటు చేయడంజరిగింది. గ్రూప్ పేరుకు మాత్రమే ఉన్నట్లు అనిపిస్తుంది. మండలములో వున్నటు వంటివివిధ శాఖల ప్రభుత్వ అధికారులు తమ తమ సమాచారాన్ని మీడియాకు అందించే విధంగా తోడ్పడాలి... ప్రతి అధికారి ప్రజలను ఇబ్బందులకు గురి చేయకుండా ప్రజల సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలి. నారాయణపుర్ మండలంలోపై అధికారుల పర్యవేక్షణ కరువయినట్లు కనబడుతుంది.

## కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటా ఎమ్మెల్యే

**సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుందాం**

**ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందాంలి మండల స్థాయి కార్యకర్తల ఆత్మీయ సమావేశంలోబి**

**ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**వనపర్తి క్రైమ్ మిర్రర్ ప్రతినిధి:** కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను, నాయకులను కడవరకుతనగుండెల్లోపెట్టిచూసుకుంటాననిఎవరు కూడా అధైర్యపడవద్దని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని ఓ కళ్యాణ మండపంలో నిర్వహించిన మండలస్థాయి కార్యకర్తల నాయకుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని గ్రామాల వారిగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు గ్రామాలలో నెలకొన్న సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించుకుందామని కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



# మార్కెట్ అభివృద్ధి, రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తా

## గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటి నూతన చైర్మన్ తలారి మల్లేష్ముదిరాజ్





**గండిపేట్(క్రైం మిర్రర్):** గుడిమల్కాపూర్ మార్కెట్ అభివృద్ధి, రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తానని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటి చైర్మన్ తలారి మల్లేష్ముదిరాజ్ అన్నారు. శుక్రవారం నూతన పాలకర్గం ప్రమాణస్వీకారోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్కుమార్ హజరై పాలకవర్గానికి ప్రమాణస్వీకారం చేయించారు. చైర్మన్గా బాధ్యతలు చేపట్టిన తలారి మల్లేష్ముదిరాజ వైస్ చైర్మన్, డైరెక్టర్లకు ఎమ్మెల్యే ప్రకాష్గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్రెడ్డి, ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకరయ్య, వాకింటి శ్రీహరి, కాలేయాదయ్య, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతిగా ఉంటూ భరోసా కల్పిస్తుంది

### గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటి చైర్మన్ తలారి మల్లేష్ముదిరాజ్



**గండిపేట్(క్రైం మిర్రర్):** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతిగా ఉంటూ వారికి భరోసా కల్పిస్తుందని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటి చైర్మన్ తలారి మల్లేష్ముదిరాజ్ అన్నారు. శుక్రవారం చైర్మన్గా ప్రమాణ స్వీకారం చేసిన ఆయనను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసి ఘనంగా శాలువాలు, పూలబోకేలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వట్టినాగులపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెద్దలు శిస్పల్సింగ్, నర్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటి డైరెక్టర్ మొద్దు ధర్మపురిముదిరాజ్ ఆధ్వర్యంలో పూలబోకేలు అందజేసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో కుమ్మరి శేఖర్, తారాసింగ్, కుమ్మరి చంద్రయ్య, మంగళారంం కృష్ణ, లక్ష్మణ్రెడ్డి, సోమయల మల్లేష్ముదిరాజ్, మంగలి యాదగిరి, మొద్దు సాయిరాంముదిరాజ్, సోమాయల ప్రణయ్ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# నెంబర్ ప్లేట్ లేని 27 ద్విచక్ర వాహనాలు సీజ్

## నెంబర్ ప్లేట్ లేని వాహనాలను శుక్రవారం వనపర్తి రూరల్ ఎస్సై ఆధ్వర్యంలో  సీజ్ చేశారు...



**వనపర్తి క్రైమ్ మిర్రర్ ప్రతినిధి:** నెంబర్ ప్లేట్ లేని వాహనాలను శుక్రవారం రూరల్ ఎస్సై జలంధర్ రెడ్డి ఆధ్వర్యంలో పెబ్బేరు రోడ్డు మరికుంట ఏరియాలో తనిఖీలు నిర్వహించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పోలీస్ ఉన్నత అధికారుల ఎస్పీ ఆదేశానుసారం నెంబర్ ప్లేట్ లేకపోయినా, నెంబర్ సరిగా కనిపించకపోయిన వాహనాలను సీజ్ చేశామన్నారు. నేటి నుండి నెంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేసే ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని అన్నారు. మండల ప్రజలు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి వాహనానికి స్పష్టంగా నెంబర్ ప్లేట్ కనపడేలా వాహనానికి అమర్చుకోవాలని సూచించారు. సిబ్బంది ఉన్నారు.

# జహంగీర్ పీర్ దర్గాను దర్శించుకున్న కొత్తూరు మండల పార్టీ అధ్యక్షుడు హరినాథ్ రెడ్డి

**క్రైమ్ మిర్రర్, నందిగామ:** కొత్తూరు మండలంలో ఎంతో ప్రసిద్ధిగాంచిన జహంగీర్ పీర్ దర్గా ఉర్సు ఉత్సవాలలో భాగంగా దర్గాను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హరినాథ్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దర్గాలో చాదర్ ను సమర్పించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మైనారిటీ సంక్షేమానికి సీఎం రేవంత్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమం లో టీపీసీసీ సోషల్ మీడియా రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దయాకర్ రెడ్డి, ఇన్ముర్ నర్వ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు సైబ్ హబీబ్, సైబ్ మహ్మద్, ఏండి ఖలీద్, ఖాజా, నజీర్, రఫీక్, వాజిద్ తదితరులు పాల్గొన్నారు



# ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలి

### యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్ రెడ్డి




**మునుగోడు క్రైమ్ మిర్రర్ :** మునుగోడు మండల కేంద్రంలో నీ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రోజు నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్ రెడ్డి కోరారు.. మునుగోడు గట్టుపల్ చండూర్ మండలాల నుండి వైద్య శిబిరానికి వచ్చే వారికి బస్సు సదుపాయం కల్పించడం జరిగినది దీనిని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని సూచించారు .కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బిమనపల్లి సైదులు,యువజన కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు పాల్వాయి జితేందర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వేమిరెడ్డి జితేందర్ రెడ్డి, చెరుపల్లి వెంకన్న, మాధగోని రాజేష్ గౌడ్, నడింపల్లి యాదగిరి , జంగిలి నాగరాజు, మునుగోటి సాయి కుమార్ పాల్గొన్నారు.

# ఫీజు రియంబర్స్మెంట్ పెండింగ్ లు విడుదల చేసి విద్యార్థులు భవిష్యత్తు కాపాడాలి

### జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి




**క్రైమ్ మిర్రర్ ఖమ్మం జిల్లా ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్రంలో గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ విదేశీ విద్యా పథకం మంజూరు చేసి విద్యార్థుల భవిషత్ ని కాపాడాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రపంచాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లే శక్తి కేవలం ఒక విధ్యకే ఉందని అటువంటి విద్య అందరికి అందాలంటే ప్రభుత్వం సహకారం ఉండాలని కోరారు. విదేశీ విద్యా పథకానికి దరఖాస్తు చేసుకున్న బీసీ విద్యార్థులందరికి స్కాలర్షిప్లు మంజూరు చేసి వారి భవిషత్ కు పునాదులు వేయాలన్నారు. ప్రభుత్వ పథకాల్లో విద్యార్థుల భవిషత్ ముఖ్యమైనదని వెంటనే ఫీజ్ బకాయిలు పెండింగ్ స్కాలర్షిప్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.




# నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

### చీఫ్ సూపర్ ఇండెంట్ మల్లేశం

**మునుగోడు క్రైమ్ మిర్రర్ :** మునుగోడు మండల కేంద్రంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన నవోదయ పరీక్ష కేంద్రంలో పూర్తిగా ఏర్పాట్లు చేసినట్లు చీఫ్ సూపర్డెంట్ టి మల్లేశం తెలిపారు..పరీక్ష కేంద్రంలో రూములలో హాల్ టికెట్ నెంబర్లు పరిశీలించారు.మొత్తం 201 విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు.విద్యార్థులు బ్లూ బ్లాక్ పెన్స్, పరీక్ష ప్యాడ్, ఫోటో గుర్తింపు కార్డు తో ఉదయం 10 గంటల వరకు చేరుకోవాలి అన్నారు. 10 గంటల 30 నిమిషాలకు విద్యార్థుల్ని పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారనీ,11 గంటల 30 నిమషాల నుండి 1 గంటల 30 నిమిషాల వరకు పరీక్ష నిర్వహించబడును అని తెలిపారు.

# పొలిటికల్ పవర్ 2025 క్యాలెండర్ ఆవిష్కరించిన తహసిల్దార్:లిజి.దేవా సింగ్



**క్రైమ్ మిర్రర్, నాంపల్లి:** మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసిల్దార్ గూగు లోతు దేవా సింగ్ చేతుల మీదుగా పొలిటికల్ పవర్ క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికలు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలా పనిచేయాలని అన్నారు. పత్రికలు నిర్భయంగా నిజాన్ని వెలికి తీయాలన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మదా పురం మాజీ సర్పంచ్ మలిగిరెడ్డి చంద్రా రెడ్డి, పొలిటికల్ పవర్ మునుగోడు ఇంచార్జ్ కోట అయోధ్య, మాల మహానాడు అధ్యక్షులు గొల్ల బోయిన వెంకటయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు శాంతి కుమార్. ఊర పాక వెంకటయ్య, కాటిక సైదులు, జంపాల సైదులు, వట్టి కోటి యాదయ్య, పొలగోని సత్తయ్య, ప్రశాంత్, స్వామి తదితరులు పాల్గొన్నారు.


# క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్లో సిబికె జట్టు విజయం



**క్రైమ్ మిర్రర్, మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో నూకల వేణన్న మిత్ర బృందం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఎన్వీఆర్ క్రికెట్ కప్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. జనవరి 17న టోర్నమెంట్ ఫైనల్లో సిబికె జట్టు ఎన్వీఆర్ జట్టుపై ఉత్కంఠ భరిత విజయాన్ని సాధించింది. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదాన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) మరియు మున్సిపల్ కమిషనర్ ఎండీ. యూసుఫ్ పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. గుమ్మిత వెంకట్ రెడ్డి జ్ఞాపకార్థం ప్రత్యేకంగా అందించిన మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ ,మ్యాన్ ఆఫ్ ద సిరీస్ బహుమతులను నవీన్ రెడ్డి ప్రోత్సహిస్తూ అందజేశారు. కార్యక్రమంలో ఎన్వీఆర్ ఫౌండేషన్ అధినేత నూకల వేణుగోపాల్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలకృష్ణ ,కౌన్సిలర్లు ఎల్.రవి నాయక్, క్రికెటర్ ఎండీ.జానీపాషా, ముదిరెడ్డి నర్సిరెడ్డి , ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెడ్ మాస్టర్ డి.ధర్మానాయక్, ఇన్చార్జీలు ధీరవత్ రమేష్ నాయక్ , ఆంగోత్ చక్రినాయక్ , కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ పాతూరి శరత్, ఎన్విఆర్ ఫౌండేషన్ సభ్యులు ఆడోత్ అశోక్ నాయక్ , గడగోజు ఆశోకచారి, గుడిపాటి కృష్ణ , ఏం.అనిల్ కుమార్ , ధనావత్ నాగునాయక్ , దాసరి భీమేష్ , కొమ్ముకోటి , ఎస్కె.మస్తాన్ , సింగం శ్రీధర్ , నాయిని లక్ష్మణ్, ప్రశాంత్ , మహేష్ ,గని , నాని , రవి , నవీన్ , రమేష్ , రేవంత్ , మనోజ్ , శేక్.రియాజ్ , మనీ, కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు, బీఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

# గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తే సహించేది లేదు

- కార్యకర్తల జోలికొస్తే ఇరగ కొట్టండి.. మీ వెనకాల నేనుంటా
- ఆరు గ్యారెంటీలతో పాటు ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తా
- మహాశివ రాత్రి రోజు నుండి తిరిగి ఈశ్వర బంధం, శ్రీ శ్రీ కళ్యాణమస్తు మొదలు పెడతా
- మన ఊరు మన ఎమ్మెల్యే పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి




**క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, వేములపల్లి:** పార్టీలకు అతీతంగా గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అందరినీ కలుపుకొని గ్రామాల అభివృద్ధి కొరకు కృషి చేయాలని,గ్రామాలలో గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తే సహించేది లేదని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం పరిధిలోని పాములపహాడ్, పోరెడ్డిగూడెం, చిరుమర్తి, ఆగామోత్కూర్, గండ్రవానిగూడెం, భీమనపల్లి, కల్వలపాలెం, బొమ్మకళ్ళు, సీతయ్యతండా, తోపుచర్ల, గండ్రవానిగూడెం, కుక్కడం గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి "మన ఊరు మన ఎమ్మెల్యే" పోస్టర్ మరియు మిర్యాలగూడ నియోజకవర్గం అభివృద్ధి కార్యక్రమాల పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వివిద గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.పార్టీలకు అతీతంగా గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అందరినీ కలుపుకొని గ్రామాల అభివృద్ధి కొరకు కృషి చేయాలని కోరారు. ఈ 13 నెలల కాలంలో నియోజకవర్గంలోని నాయకులు, అధికారుల నడవడికను అలాగే ప్రతి గ్రామంలో పరిస్థితులను తాను అవగాహన చేసుకున్నానన్నారు. తన తల్లి మరణంతో ఆగిపోయిన "ఈశ్వర్ బంధం", "శ్రీశ్రీ కళ్యాణమస్తు", కార్యక్రమాలను మహా శివరాత్రి పర్వదినం నుండి తిరిగి మొదలు పెడతానని ప్రకటించారు. గ్రామాలలో గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తే సహించేది లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల జోలికొస్తే ఎగబడి కొట్టండి మీ వెనకాల నేనుంటా అని హామీ ఇచ్చారు. సంపాదన కోసం తాను రాజకీయాల్లోకి రాలేదని,పది కాలాలపాటు గుర్తుండిపోయే అభివృద్ధి పనులు చేయడమే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ప్రతి కార్యకర్త నాయకులు పార్టీ కోసం ఐక్యమత్యంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాడుగులపల్లి మండల అధ్యక్షులు గడ్డం వేణుగోపాల్ రెడ్డి, పాములపహాడ్ అధ్యక్షులు తోట సత్తిరెడ్డి, పోరెడ్డిగూడెం అధ్యక్షులు జూలకంటి సైదిరెడ్డి, చిరుమర్తి అధ్యక్షులు ప్రసాద్, ఆగమోత్కూర్ అధ్యక్షులు యాదయ్య, మాజీ సర్పంచ్ లు చింతకుంట్ల శ్రీనివాసరెడ్డి, మంగ యాదయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాంద్ర యాదగిరి, మామిడి సైదులు, చింతకాయల సతీష్, శీలం శ్రీశైలం, తీగల సతీష్, వెంకటరెడ్డి, ఆర్సి రెడ్డి, బట్టు మాధవరెడ్డి, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు....

# ఆత్మీయతకు ప్రతీక కిన్నెర కుటుంబం




### గొప్పగా కిన్నెర కుటుంబాల ఆత్మీయ కలయిక
### నాలుగు తరాలు ఒకేచోట కలిసిన వేళ
### కిన్నెర ఉద్యోగులు, మేధావులకు ఘన సన్మానం
### ఉమ్మడి ఖమ్మం జిల్లా నుండి 2000 మంది హాజరు

**క్రైమ్ మిర్రర్ ఖమ్మం జిల్లా ప్రతినిధి :** ఆత్మీయతకు ప్రతీక కిన్నెర కుటుంబం. 2 వేల మందితో కిన్నెర కుటుంబాల ఆత్మీయ సమ్మేళనం ఖమ్మంలో ఘనంగా జరిగింది. ఖమ్మం నగరంలోని సూర్యదేవర ఫంక్షన్ హాల్లో శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లా నుండి కిన్నెర కుటుంబాలు నాలుగు తరాల వారు సుమారుగా 2000 మందితో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కిన్నెర కుటుంబ ఆత్మీయ సమ్మేళన కమిటీ అధ్యక్షులు కిన్నెర ప్రసాద్, ఉపాధ్యక్షులు కిన్నెర కుటుంబరావు, గౌరవ సలహాదారులు ఏఎస్ఐ కిన్నెర వెంకటేశ్వర్లు, కండక్టర్ కిన్నెర ఆనంద్, వెటర్నరీ డాక్టర్ కిన్నెర వెంకటేశ్వరరావు లతో పాటు కిన్నెర కుటుంబ సభ్యులు కిన్నెర కుటుంబ పేరుతో ఉన్న వారందరినీ ఒక వేదిక మీదికి తీసుకురావడానికి వారి కృషి ఎంతో అభినందనీయం. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కిన్నెర కుటుంబాలలో విద్య, వైద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ, ఆర్థిక పరమైన విధానాలలో ఐకమత్యంతో ముందుకు సాగాలని, అందరూ సహకరించాలని కోరారు. కిన్నెర కుటుంబాలలోని ఉద్యోగులు, డాక్టర్లు, విద్యలో రాణిస్తున్న విద్యార్థులు, ముందుతరాల వృద్ధులను ఘనంగా ఆత్మీయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో కొణిజర్ల కిన్నెర కుటుంబాల వారు కోలాట నృత్యాలతో అలరించారు. అలాగే గాయకులు వారి పాటలతో అందరిని మైమరిపించారు. కిన్నెర కుటుంబ సభ్యులు ఒకేచోట కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని, ఇతరులకు ఆదర్శమని కొనియాడారు. నాలుగు తరాల వారు ఒకే ఇంటి పేరుతో ఉన్న కిన్నెర ఆత్మీయ సమ్మేళనాన్ని ఏకాభిప్రాయంతో మంచి కార్యక్రమని అభినందించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ వెంకటేశ్వరరావు కర్ర సాముతో అలరించారు. కిన్నెర ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయడంలో కీలకపాత్ర పోషించిన సభ్యులను ప్రతి ఒక్కరూ అభినందించారు. కళాకారులు పమ్మి రవి బృందం, ఓం బొమ్మెర ముత్యం, పాగి వెంకన్న, గోవింద గురవయ్య, పి. వీరబాబు లు వారి పాటలతో ఎంతో అలరింపజేశారు. ముఖ్య అతిథులుగా కిన్నెర కుటుంబానికి చెందిన అల్లుళ్ళు బొమ్మెర రామ్మూర్తి, కొత్తపల్లి గురు ప్రసాద్ లు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కిన్నెర ఆత్మీయ సమ్మేళనం కమిటీ సభ్యులు కుటుంబరావు, నాగేశ్వరరావు, రాము, ఆర్టీసీ ఆనందరావు, రమేష్, శ్రీనివాసరావు, ఏనుకూరు కుటుంబ సభ్యులు కిన్నెర రాములు, రాంబాబు, పాపారావు, మహిళా ప్రతినిధులు కరుణ, విజయ, ఝాన్సీ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# మన ఊరు మన ఎమ్మెల్యేవి వత్తి మాటలేనా..?

### ప్రజా పాలనలో దరఖాస్తు చేసిన తప్పని తిప్పలు
### తూతూ మంత్రంగా కులగన రేషన్ కార్డుల సర్వే
### ప్రభుత్వ సంక్షేమ పథకాలకు రేషన్ కార్డు ప్రమాణికం
### ప్రజా పాలన దరఖాస్తులు మూలకు ములుగుతున్నాయా..?
### జాబితాలో దరఖాస్తుదారుల పేర్లు గల్లంతు.. అయోమయంలో ప్రజలు
### అధికార పార్టీ ఎమ్మెల్యే, అధికారులు నిద్రమత్తు వదలరా?



**క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, వేములపల్లి, మాడుగులపల్లి:** ఎన్నో ఏళ్ల నుంచి రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు ఒక్కసారిగా షాక్ తగిలింది. అధికారులు తూతు మంత్రంగానే సర్వే నిర్వహించి రేషన్ కార్డుల జాబితాను విడుదల చేయడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పూర్తి వివరాలు లోకి వెళ్తే.. నల్గొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గం వేములపల్లి, మాడుగులపల్లి మండలాలలో రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి తిప్పలు తప్పడం లేదు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు లబ్ధి పొందడం కోసం రేషన్ కార్డు ప్రామాణికం కావడంతో దరఖాస్తుదారులు అయోమయం లో పడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి "మన ఊరు మన ఎమ్మెల్యే" కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం అందరికీ తెలిసిందే. ఈ కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా ప్రభుత్వం ప్రకటించిన ఆరు సంక్షేమ పథకాలు నిష్పక్షపాతంగా ప్రతి ఒక్కరికి అందాలని చెప్తున్న మాటలన్నీ పచ్చి అబద్దాల మాటలేనని అగ్రహ వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. మండలంలో ప్రజా పాలన దరఖాస్తులు మూలకు మురుస్తున్నాయా? అని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తూతు మంత్రంగానే సర్వే నిర్వహించి రేషన్ కార్డుల జాబితాను విడుదల చేయడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంక్షేమ పథకాలకు రేషన్ కార్డు ప్రామాణికం కావడంతో మండలంలోని రేషన్ కార్డ్ దరఖాస్తుదారులు జాబితాలో పేరు రాకపోవడంతో తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు, స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించి అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందించాలని కోరుతున్నారు.



# అర్హుల గుర్తింపు ప్రక్రియపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

### జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి క్రైమ్ మిర్రర్ ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుంచి ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు పథకాల అమలుకు అర్హులైన వారిని గుర్తించే ప్రక్రియ పకడ్బందీగా జరగాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. పథకాలకు అర్హుల గుర్తింపు విషయమై శుక్రవారం కొత్తకోట, మదనాపురం, ఆత్మకూరు, అమరచింత మండలాల తహసిల్దార్ కార్యాలయాల్లో అధికారులతో వేర్వేరు సమావేశాలు నిర్వహించారు. అనంతరం పథకాలకు అర్హుల గుర్తింపు ఎలా జరుగుతుందో పరిశీలించేందుకు కొత్తకోట మండల పరిధిలోని రాయిని పేట, ఆత్మకూరు మండల పరిధిలోని మూల మల్ల, అమరచింత మున్సిపాలిటీ లోని 9వ వార్డ్ లలో సందర్శించి పథకాలకు అర్హుల గుర్తింపు ప్రక్రియ ఏ విధంగా జరుగుతుందో అనే విషయాన్ని పరిశీలించారు. ఆత్మకూరు మూలమల్ల గ్రామంలో పంచాయతీ సెక్రెటరీ, ఫీల్డ్ అసిస్టెంట్లు విధుల్లో అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం పై వహిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు కల్పిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందే విధంగా సర్వే ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రైతు భరోసా అమలు కోసం మండల పరిధిలో వ్యవసాయేతర, నాలా భూముల గుర్తింపు ప్రక్రియ పకడ్బందీగా, వేగవంతంగా చేయాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో వ్యవసాయతర భూములను గుర్తించే ప్రక్రియను చేపట్టిన వ్యవసాయ విస్తరణ అధికారులకు తహసీల్దార్, ఎంఏఓ ఎప్పటికప్పుడు సూచనలు చేస్తూ, పర్యవేక్షణ ఉంచాలన్నారు. ఆలస్యం చేయకుండా వ్యవసాయెతర భూములు, లే అవుట్లు చేసినవి, భూసేకరణ చేసినవి తదితర భూములను గుర్తించలన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తుల జాబితాను వెంటబెట్టుకుని పంచాయతీ కార్యదర్శులు అర్హుల గుర్తింపు ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు సంబంధించి మండలంలో ఉన్న జాబ్ కార్డుల ఆధారంగా కుటుంబ ఆర్థిక స్థితిగతులు, వారి పేరు పై ఏమైనా భూమి ఉన్నదా అనే వివరాలు పకడ్బందీగా పరిశీలించాలని సూచించారు. ఉపాధి హామీ కూలీల జాబితా ఆధారంగా వారి ఆధార్ వివరాలు, బ్యాంక్ అకౌంట్ వివరాలు సరిగా ఉన్నాయా లేవా చెక్ చేయాలన్నారు. అదేవిధంగా, ఇందిరమ్మ ఇండ్ల కోసం చేసిన సర్వే ఆధారంగా తయారుచేసిన జాబితాపై సూపర్ చెక్ చేయాలని ఆదేశించారు. ఆయా గ్రామాల్లో నిజంగా అద్దెకు ఉంటున్న వారి జాబితాను గుర్తించాలని సూచించారు. ఇల్లు లేని నిరుపేదలకే లబ్ధి చేకూర్చడమే ఈ పథకం లక్ష్యమని సర్వే ఆధారంగా నిజమైన లబ్ధిదారులను గుర్తించాలని చెప్పారు. ప్రత్యేక అధికారులు జడ్పీ డిప్యూటీ సీఈవో రామ మహేశ్వర్, బీసీ సంక్షేమ అధికారి బీరం సుబ్బారెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లికార్జున్, డిపిఓ సురేష్, తహసిల్దార్లు, ఎంపీడీఓ లు, మున్సిపల్ కమిషనర్లు, వ్యవసాయ అధికారులు, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# తొందరలోనే చేవెళ్లలో ఉప ఎన్నిక వస్తుంది..!

### 'కేసీఆర్ పై ప్రజల ప్రేమ' తో కాలే యాదయ్య గెలిచిండు
### గెలిచాక రేవంత్ రెడ్డి సంకలో చేరిండు
### అభివృద్ధి కోసం పార్టీ మారిన అంటూ నమ్మిన ప్రజలను మోసం చేసిండు
### చేవెళ్ల ప్రజలు ఈసారి గట్టిగా బుద్ధి చెప్పాలి
### షాబాద్ లో జరిగిన రైతు ధర్నా లో మాజీ మంత్రి కేటీఆర్ ఫైర్



చేవెళ్ల (క్రైమ్ మిర్రర్):రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గంలో తొందరలోనే ఉప ఎన్నిక వస్తుందని,ఈసారి చేవెళ్ల ప్రజలు కాలే యాదయ్యకు గట్టిగా బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు.శుక్రవారం షాబాద్ లో జరిగిన రైతు ధర్నాలో కేటీఆర్ కీలక వాఖ్యలు చేశారు.పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలపై గురువారం సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ ను బీఆర్ఎస్ దాఖలు చేసిందన్నారు.ఇక్కడి ఎమ్మెల్యే కేసీఆర్ పై ప్రజలకు ఉన్న ప్రేమతో గెలిచిండన్నారు.గెలిచాక అభివృద్ధి కోసం పార్టీ మారిన అంటూ నమ్మిన ప్రజలను మోసం చేసిండన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కక్ష్య పూరిత చర్యలకు పాటుపడుతుందని మండిపడ్డారు.హామీలు అమలు చేసే వరకు ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటామని కేటీఆర్ ఫైర్ అయ్యారు.



## పటిష్ట స్థితిలో భారత్.. మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా

న్యూఢిల్లీ: సైనిక శక్తి, రాజకీయ సుస్థిరత, బలమైన ప్రజాస్వామ్యం తదితర అంశాల దన్నుతో అంతర్జాతీయంగా భారత్ పటిష్టమైన స్థితిలో ఉందని మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా తెలిపారు. అవకాశాలను అందిపుచ్చుకుని, మరింతగా ఎదిగే సత్తా దేశానికి ఉందని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా వివిధ దేశాల మధ్య భాగస్వామ్యాల్లో చోటుచేసుకుంటున్న మార్పులు, అనిశ్చితులను.. భారత్ అవకాశాలుగా మల్చుకోవచ్చని మహీంద్రా చెప్పారు. ప్రపంచ సరఫరా వ్యవస్థలో కీలక భాగంగా మారొచ్చని నూతన సంవత్సరం సందర్భంగా ఉద్యోగులకు ఇచ్చిన సందేశంలో ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయంగా నెలకొన్న అస్థిరత ప్రభావం ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌పై తక్కువగా ఉంటుందని మహీంద్రా తెలిపారు. తమ గ్రూప్ అధిగమించిన కీలక మైలురాళ్లను ప్రస్తావిస్తూ .. అత్యంత విలువైన వాహనాల తయారీ దిగ్గజంగా ప్రపంచంలోనే 11వ స్థానానికి చేరడం, ఎలక్ట్రిక్ వాహనాలు అంచనాలకు మించి విజయవంతం కావడం గర్వించతగ్గ విషయాలని ఆయన పేర్కొన్నారు. గ్రూప్‌లోని ఇతర కంపెనీల పనితీరును కూడా ప్రశంసించారు. ఆకాంక్షలను సాకారం చేసుకోగలమనే స్ఫూర్తితో భవిష్యత్తుపై ఆశావహంగా ఉండాలని సూచించారు.

# పథకాల పండుగ ...!

### ఇందిరమ్మ ఇళ్లు,ఆత్మీయ భరోసా,రైతు భరోసా,కొత్త రేషన్‌కార్డుల జారీకి కార్యాచరణ సిద్ధం...!

### వివరాలు సేకరించే పనిలో అధికార యంత్రాంగం...! ఆశగా ఎదురుచూస్తున్న లబ్దిదారులు..!





**క్రైమ్ మిర్రర్ వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల జారీ ప్రారంభం కానుంది.ఇప్పటికే క్షేత్రస్థాయిలో ప్రజాపాలన దరఖాస్తులు, కుటుంబ సర్వేలో ప్రజలు పేర్కొన్న వివరాల ఆధారంగా ఇంటింటి సర్వే పూర్తయింది. అర్హులను గుర్తించేందుకు జిల్లాలో అధికారులు ప్రతీ గడపకు వెళ్లి వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేశారు. అక్కడక్కడ సమస్యలు ఉన్నా పరిష్కరిస్తున్నారు. ఈ క్రమంలో వికారాబాద్ జిల్లాలో సంక్షేమ పథకాల పండుగ మొదలు కానుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్ కు అంతా సక్రమంగా సాగేలా దిశానిర్దేశం చేసింది. పథకాల ఎంపికకు కీలకంగా మారిన గ్రామసభల్లో ఈ నెల 24లోపు అర్హులను గుర్తించాల్సి ఉంది.పండుగ తర్వాత అధికార యంత్రాంగం పథకాల అమలుపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించనుంది. మరోవైపు ఈ నెల 26 తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటన చేస్తానని ప్రకటించడంతో ఉమ్మడి జిల్లా అధికారులు అప్రమత్తం అయ్యారు.

**తగ్గనున్న రైతు భరోసా...?**

ఈ నెల 16నుంచి రైతుభరోసా కోసం సాగు సర్వే మొదలైయ్యాయి.నాలుగు రోజుల్లో అంటే 20వరకు సర్వే పూర్తి చేసి సాగు భూముల లెక్క తేల్చాలి ఉంది. రెవెన్యూ, వ్యవసాయ అధికారులు చేపట్టే ఈ సర్వేలో పట్టాభూములుగా ఉండి, సాగులో ఉన్నట్లు ధ్రువీకరిస్తేనే రైతు భరోసా కింద పెట్టుబడి సాయం ఎకరానికి రూ.12వేల చొప్పున అందనుంది. జిల్లాలో చాలా భూములు రియల్ వెంచర్లుగా మారిపోయాయి.మరికొన్ని చోట్ల రోడ్లు, వ్యాపార కార్యక్రమాల కోసం వినియోగిస్తున్నారు. కొన్నిచోట్ల ఇంకా రెవెన్యూ రికార్డుల్లో సాగు భూములుగానే కొనసాగుతున్నాయి. వీటిపైన సమగ్రంగా సర్వేచేసి లబ్ధిదారులను తేల్చనున్నారు.గతంలో గుట్టలు, అటవీ భూములు, రోడ్లు, వెంచర్లు, వాగులు, వంకల్లో ఉన్న భూములు, పట్టణ శివార్లలో ఇళ్ల స్థలాలకు సైతం పెట్టుబడి సాయం అందింది. తాజా సర్వేతో గత ప్రభుత్వం ఇచ్చిన రైతుబంధు కంటే భరోసా లబ్ధిదారులు తగ్గే అవకాశం ఉంది.

**ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు..!**

కొత్త రేషన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్న వారికి భారీ ఊరట కలుగనుంది. పాత విధానంలోనే కొత్త రేషన్ కార్డులు జారీ చేసే అవకాశం ఉంది. ఇప్పటికే వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు.పెళ్లయిన వారు, చిన్న పిల్లల పేర్ల మార్పులు, చేర్పులు, కుటుంబాల నుంచి వేర్వేరుగా ఉన్న వారికి రేషన్ కార్డుల అవసరం ఏర్పడుతోంది. ప్రస్తుతం పథకాలు రేషన్‌కార్డుల ఆధారంగానే ఎంపిక చేస్తున్న తరుణంలో కార్డుల కోసం అనేక మంది ఎదురు చూస్తున్నారు. ఇక భూమి లేని వారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏడాదికి రూ.12వేల సాయం అందనుంది. ఇందుకు ఉపాధిహామీ పథకంలో కనీసం 20రోజులు పని దినాలు చేసినట్లు నమోదై ఉన్నవారికి అవకాశం కల్పిస్తారు.

**తర్వాత 'స్థానిక"..?**

కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో కీలకమైన ఈ మూడు సంక్షేమ పథకాల అమలు మొదలైన తర్వాతే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందని తెలుస్తోంది.ఈ మేరకు ఇప్పటికే పోలింగ్ కేంద్రాలు, వార్డులు, ఓటర్ల మార్పులు,చేర్పులతో తుది జాబితా వెలువడింది.నాయకులు సైతం ఎన్నికల కోసం సన్నద్ధం అవుతున్నారు. ఈ నేపథ్యంలో పథకాల అమలు జరిగాక పంచాయతీ, మండల, జెడ్పీ, ఆ తర్వాత పట్టణ పరిధిలో మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**ఇందిరమ్మ ఇళ్లు..!**

గూడు లేని నిరుపేదలకు ఇళ్లు అందించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేయనున్నారు.ఇప్పటికే సర్వే పూర్తి కాగా, అర్హులను ప్రకటించాల్సి ఉంది. ఒక్కో నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఉమ్మడి జిల్లా పరిధిలో గిరిజన ప్రాంతాలతో సహా గ్రామ, పట్టణాల్లో నిర్వహించే సభల్లోనే అర్హులను ఎంపిక చేయనున్నారు.






## కబేలాలకు తరలిస్తున్న 60 గోవులను రక్షించిన గోరక్షక్ దళ్

### పహాడి షరీఫ్ పోలీసులకు అప్పగించిన గోరక్షక్ దళ్

### గోవులను రక్షించే వారిపై అక్రమ కేసులు పెట్టొద్దు: గోరక్షక్ దళ్

### గోవులను రక్షించే కొత్త చట్టాన్ని తీసుకురావాలి: యాదగిరి రెడ్డి

మహేశ్వరం ప్రతినిధి(క్రైమ్ మిర్రర్): మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ మున్సిపాలిటీ ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో కబేలాలకు తరలిస్తున్న 60 గోవులను గో రక్షక్ దళ్ బోధ యాదగిరి రెడ్డి, శ్రీధర్,కాలు సింగ్ ఆధ్వర్యంలో డి సి ఎం లో ఆవులను, లేగ దుడలను తరలిస్తున్న వాహనాన్ని పట్టుకొని పహాడీ షరీఫ్ పోలీసులకు అప్పగించరు.పోలీసులు కేసు నమోదు చేసుకొని అక్కడి నుంచి చిన్న జీయర్ స్వామి గోశాలకు తరలించారు,ఈ సందర్బంగా యాదగిరి రెడ్డి మాట్లాడుతూ...ఎన్నిసార్లు ఇలా గోమాతలను వేల సంఖ్యలో కబేలాలకు తరలిస్తున్నా ప్రభుత్వం కానీ పోలీస్ శాఖ కానీ ఎక్కడ కూడ చెక్పోస్టులు వేయకుండా కబేలాలకు తరలించే వారి నుండి మామూల్లు తీసుకుంటూ చూసి చూడనట్టు వదిలేస్తున్నారని ఆరోపించారు,రోజుకు సుమారుగా వేల ఆవుల ప్రాణాలు తీస్తున్న వాళ్లను కఠినంగా శిక్షించాలని కోరారు. ప్రభుత్వం కానీ పోలీస్ శాఖ గాని సపోర్ట్ చేస్తూ గోరక్షణలో పాల్గొనాలన్నారు,ఆవులను రక్షిస్తున్న వారి మీద కేసులు పెడుతూ హింసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ప్రభుత్వం వెంటనే గో రక్షణ చట్టాన్ని తీసుకురావాలని, చెకపోస్టులు ఏర్పాటు చేయాలని బజ్ రంగ్ దళ్,గో రక్షక్ దళ్ సభ్యులు కోరుతున్నారు.


# క్యూ3 ఫలితాలే దిక్సూచి

### ఈ వారం మార్కెట్ల ట్రెండ్‌పై అంచనాలు

### టీసీఎస్, టాటా ఎలక్సీ రెడీ

### పారిశ్రామికోత్పత్తి గణాంకాలు కీలకం

### విదేశీ అంశాలకూ ప్రాధాన్యం



ముంబై: దేశీ స్టాక్ మార్కెట్లను ఈ వారం ప్రధానంగా కార్పొరేట్ ఫలితాలు నడిపించనున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సర(2024%–%25) మూడో త్రైమాసిక ఫలితాల సీజన్ ప్రారంభంకానుంది. దీనికితోడు పారిశ్రామికోత్పత్తి గణాంకాలు సైతం విడుదలకానున్నాయి. దీంతో ఇన్వెస్టర్లు అక్టోబర్%–%డిసెంబర్(క్యూ3) ఫలితాలు, ఆర్థిక గణాంకాలపై దృష్టి పెట్టనున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. ఇవికాకుండా ప్రపంచ రాజకీయ, భౌగోళిక అంశాలకూ ప్రాధాన్యత ఉన్నట్లు తెలియజేశారు. వివరాలు చూద్దాం..

**9న షురూ**

సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం టీసీఎస్‌తోపాటు టాటా గ్రూప్ కంపెనీ టాటా ఎలక్సీ, ఫైనాన్షియల్ పీఎస్‌యూ ఇండియన్ రెనెవబుల్ ఎనర్జీ(ఇరెడా) గురువారం(9న) క్యూ3 పనితీరును వెల్లడించనున్నాయి. తద్వారా ఫలితాల సీజన్‌కు శ్రీకారం చుట్టనున్నాయి. ఇటీవలే స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయిన ఫిన్‌టెక్ సంస్థ వన్ మొబిక్విక్ సిస్టమ్స్ మంగళవారం తొలిసారి త్రైమాసిక ఫలితాలు ప్రకటించనుంది. టీసీఎస్ పటిష్ట పనితీరు సాధిస్తే ఇటీవల అమ్మకాల బాటలో సాగుతున్న విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులవైపు దృష్టి పెట్టవచ్చని రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా పేర్కొన్నారు.

**దేశీ అంశాలు**

వారాంతాన(10న) ప్రభుత్వం నవంబర్ నెలకు పారిశ్రామికోత్పత్తి ఇండెక్స్(ఐఐపీ) గణాంకాలు వెల్లడించనుంది. అక్టోబర్‌లో ఐఐపీ వార్షికంగా 3.5 శాతం పుంజుకుంది. అంతేకాకుండా డిసెంబర్ నెలకు హెచ్‌ఎస్‌బీసీ సర్వీసెస్ పీఎంఐ గణాంకాలు విడుదలకానున్నాయి. వచ్చే నెల మొదట్లో కేంద్ర ప్రభుత్వం సార్వత్రిక బడ్జెట్‌ను ప్రకటించనుంది. దీంతో ఇన్వెస్టర్లు బడ్జెట్ ప్రతిపాదలపైనా దృష్టి పెట్టనున్నట్లు స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ సీనియర్ టెక్నికల్ అనలిస్ట్ ప్రవేశ్ గౌర్ అభిప్రాయపడ్డారు.

**ట్రంప్ ఎఫెక్ట్**

ఈ నెల మూడో వారంలో రిపబ్లికన్ నేత డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో గత వారాంతాన ముడిచమురు ధరలు బలపడ్డాయి. బ్రెంట్ బ్యారల్ 75 డాలర్లను తాకింది. మరోపక్క డాలరుతో మారకంలో రూపాయి సరికొత్త కనిష్టం 85.79కు చేరింది. ఇక ఫెడ్ ఓపెన్ మార్కెట్ కమిటీ(ఎఫ్‌వోఎంసీ) గత పాలసీ నిర్ణయాలకు సంబంధించిన వివరాలు(మినిట్స్) 9న వెల్లడికానున్నాయి. ఈ అంశాలు సైతం సెంటిమెంటును ప్రభావితం చేయగలవని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయిర్ అంచనా వేశారు. కాగా.. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు దేశీ స్టాక్స్‌లో అమ్మకాలకే మొగ్గు చూపుతున్నారు. అయితే దేశీ ఫండ్స్ భారీ స్థాయిలో ఇన్వెస్ట్ చేస్తున్నాయి. ఈ అంశాలన్నీ ట్రెండ్ నిర్ణయంలో కీలకంగా నిలవనున్నట్లు మెహతా ఈక్విటీస్ రీసెర్చ్ సీనియర్ వీపీ ప్రశాంత్ తాప్సే తెలియజేశారు. శుక్రవారం(3)తో ముగిసిన గత వారం తీవ్ర ఆటుపోట్ల మధ్య మార్కెట్లు బలపడ్డాయి. బీఎస్ఈ సెన్సెక్స్ నికరంగా 524 పాయింట్లు(0.7 శాతం) పుంజుకుని 79,223 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ సైతం 191 పాయింట్లు(0.8 శాతం) ఎగసి 24,000 పాయింట్లకు ఎగువన 24,005 వద్ద నిలిచింది.

క్రైమ్ మిర్రర్
విలేకరులు కావలెను
క్రైమ్ మిర్రర్ తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు,
నియోజకవర్గం, మండలాలవారీగా
అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు ఈ క్రింది
నెంబరుకు సంప్రదించగలరు.
93934 46188

# విశాఖ స్టీల్ ప్లాంట్‌కు భారీ ఆర్థిక చేయూత

## రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీని ప్రకటించిన కేంద్రం

## కేంద్రానికి కృతజ్ఞతలు చెబుతూ మంత్రి రామ్మోహన్ ట్వీట్

**న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్):** విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం శుభవార్త చెప్పింది. స్టీల్ ప్లాంట్‌కు రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీని కేంద్రం ప్రకటించింది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ అధికారికంగా వెల్లడించారు. ఇటీవల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కలిసినప్పుడు స్టీల్ ప్లాంట్‌కు ఆర్థిక ప్యాకేజ్ ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ఈ క్రమంలో స్టీల్ ప్లాంట్ ఆపరేషనల్ పేమెంట్స్ కోసం రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజ్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. వైజాగ్ స్టీల్ ఎ÷-లాంట్‌కు ఆర్థిక ప్యాకేజీని ప్రకటించినందుకు గాను ప్రధాని మోదీకి ఎక్స్ వేదికగా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ధన్యవాదాలు తెలిపారు.'విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఊపిరి పోసేలా రివైవల్ ప్యాకేజీ కింద రూ.11,400 కోట్లు కేటాయించిన ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు. నష్టాలను అధిగమించి, ప్లాంట్ పూర్తి స్థాయి ఉత్పాదనతో లాభాల బాట పెట్టేందుకు ఈసాయం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి, ప్రజల ఆకాంక్షల పట్ల ఎన్డీయే ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనం' అంటూ కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ట్వీట్ చేశారు. నష్టాలను అధిగమించేందుకు, ప్లాంట్ పూర్తి ఉత్పాదనతో లాభాల బాట పట్టేందుకు కేంద్ర ప్యాకేజీ దోహద పడుతుందన్నారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజల ఆకాంక్షల పట్ల కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమన్నారు.



# పెట్టుబడులు లక్ష్యంగా చంద్రబాబు దావోస్ పర్యటన

## సిఎంతో పాటు పలువురు మంత్రులు, అధికారులు

**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా దావోస్‌లో జరిగే ప్రపంచదేశాల ఆర్థిక సదస్సులో సిఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ పాల్గొనబోతున్నారు. ఐదు సెషన్లలో ప్రధానవక్తగా మాట్లాడేందుకు రాష్ట్రం తరపున అవకాశం దక్కింది. వాటిలో సీఎం చంద్రబాబు మూడు సెషన్లు.. మంత్రి లోకేశ్ రెండు సెషన్లలో మాట్లాడనున్నారు. అందుకు అనుగుణంగా వారి పేర్లతో 'వైట్‌పాస్'లు డబ్ల్యూఈఎఫ్ నుంచి అందాయి. ఆహ్వానితులకే సమావేశాల్లో పాల్గొనడానికి, మాట్లాడడానికి అవకాశం ఉంటుంది. ఈ సమావేశాల్లో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు శనివారం రాత్రి బయలుదేరి వెళ్లనున్నారు. ఈ నెల 20 నుంచి ఐదురోజుల పాటు దావోస్‌లో జరిగే సమావేశాల్లో ఆయన పాల్గొంటారు. ఈ వేదిక ద్వారా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను కంపెనీల ప్రతినిధులకు సీఎం వివరించనున్నారు. క్లీన్ ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్‌తో పాటు.. ఐటీ, పలు కీలకరంగాల్లో పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షించేందుకు దావోస్‌ను వేదికగా చేసుకోవాలన్నది ప్రభుత్వ ఆలోచన. ఇటీవల రాష్ట్రానికి వచ్చిన భారీ ప్రాజెక్టుల గురించి వివరించడం ద్వారా ప్రపంచ దృష్టిని ఆకర్షించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ సదస్సులో పాల్గొనడం ద్వారా రాష్ట్రానికి గరిష్ఠ పెట్టుబడుల ప్రయోజనాన్ని సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్రంలో పెట్టుబడులకున్న అవకాశాలను ప్రపంచ దేశాలకు వివరించేలా ప్రత్యేకంగా రాష్ట్ర పెవిలియన్‌ను ఏర్పాటుచేశారు. అందులో ఒకేసారి నాలుగు రౌండ్‌టేబుల్ సమావేశాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. వివిధ కార్యక్రమాల్లో సీఎం బిజీగా గడిపితే.. వీలైనన్ని రౌండ్‌టేబుల్ సమావేశాలను నిర్వహించే బాధ్యతలను అధికారులు, ఇతర ప్రతినిధులకు అప్పగించారు. ద్వైపాక్షిక సమావేశాల్లో 18 దేశాలకు చెందిన కంపెనీల సీఈవోలు, ప్రతినిధులతో సమావేశం కానున్నారు. సీఐఐ నిర్వహించే బ్రేక్‌ఫాస్ట్ సెషన్‌లో



సీఎం, మంత్రులు, అధికారులు పాల్గొంటారు. రాష్ట్రప్రభు త్వం కూడా వివిధ దిగ్గజ కంపెనీల సీఈవోలతో సమావేశం ఏర్పాటుచేస్తోంది.

రాష్ట్రం ఏర్పాటుచేసే పెవిలియన్‌ను సందర్శించాలని సదస్సుకు హాజరయ్యే వివిధ దేశాల ప్రభుత్వాలకు రాష్ట్ర ప్రభుత్వం లేఖలు రాసింది. దావోస్ వెళ్లే బృందంలో సీఎంతో పాటు మరో ఎనిమిది మందికి అవకాశం లభించింది. ప్రభుత్వ అధికారులు, మంత్రులు మాత్రమే బృందంలో సభ్యులుగా ఉండాలని కేంద్రం నుంచి ఆదేశాలు అందాయి. ఈ ప్రకారం మంత్రులు లోకేశ్, టీజీ భరత్, సీనియర్ అధికారులు కార్తికేయ మిశ్రా, పియూష్‌కుమార్, యువరాజ్, సీఎం ముఖ్య భద్రత అధికారి శ్రీకాంత్, ఈడీబీ సీఈవో సాయికాంత్ వర్మ, కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ పీడీ వికాస్ మర్మత్ ఈ బృందంలో ఉండేందుకు కేంద్రం నుంచి అనుమతులు వచ్చాయి. అధికారులు, మంత్రులకు సహాయకులుగా మరో 15మంది దావోస్ వెళ్లనున్నారు.రాష్ట్రంలో ఇటీవల ప్రకటించిన పారిశ్రామిక పాలసీలో ప్రత్యేకతలు వంటి అంశాలను వివరించడం ద్వారా పెట్టుబడిదారుల దృష్టి ఆకర్షించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

# సెంటిమెంట్ దెబ్బ

## నష్టాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు



**ముంబై,(క్రైమ్ మిర్రర్):** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. వరుసగా మూడు రోజుల పాటు లాభాలు చవిచూసిన సూచీలు.. ఐటీ, బ్యాంకింగ్ షేర్ల రూపంలో అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. మరికొన్ని రోజుల్లో ట్రంప్ అధికార పగ్గాలు చేపట్టనుండడం, అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు పెరుగుదల, విదేశీ మదుపర్ల అమ్మకాలు కొనసాగుతుండడం వంటివి సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఓ దశలో సెన్సెక్స్ 700 పాయింట్ల మేర నష్టపోగా.. తర్వాత కాస్త కోలుకుంది. నిఫ్టీ 23,200 స్థాయికి చేరింది. సెన్సెక్స్ ఉదయం 77,069.19 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 76,263.29 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 423.49 పాయింట్ల నష్టంతో 76,619.33 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 108.60 పాయింట్ల నష్టంతో 23,203.20 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.61 వద్ద ఎ÷-లాట్‌గా ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో గురువారం ఫలితాలు ప్రకటించిన ఇన్ఫోసిస్ అత్యధికంగా 6 శాతం మేర నష్టపోయింది. బలహీన త్రైమాసిక ఫలితాలు ప్రకటించిన యాక్సిస్ బ్యాంక్ సైతం 5 శాతం మేర క్షీణించింది. దీని ప్రభావం ఇతర బ్యాంక్ షేర్లపైనా పడింది. కోటక్ మహీంద్రా బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, టీసీఎస్ సైతం నష్టాల్లో ముగిశాయి. జొమాటో, రిలయన్స్, నెస్లే ఇండియా, టాటా స్టీల్, ఏషియన్ పెయింట్స్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 81 డాలర్ల ఎగువన ట్రేడవుతుండగా.. బంగారం సైతం 2730 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# వైట్‌హైజ్ వద్ద ట్రక్కుతో దాడికి యత్నం

## భారత సంతతికి చెందిన సాయి వర్షిత్‌కు 8 ఏళ్ల జైలు

**వాషింగ్టన్,(క్రైమ్ మిర్రర్):** అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ వద్ద 2023లో భారత సంతతి యువకుడు ట్రక్కుతో దాడికి యత్నించిన ఘటన తీవ్ర కలకలం రేపిన ఘటనలో నిందితుడైన తెలుగు సంతతి వ్యక్తి 19 ఏళ్ల కందుల సాయి వర్షిత్ కు కోర్టు 8 ఏళ్ల జైలుశిక్ష విధించింది. వర్షిత్‌ను అప్పట్లోనే పోలీసులు అరెస్టు చేశారు. తాజాగా ఈ కేసులో అతడికి 8 ఏళ్ల జైలు శిక్ష విధించినట్లు జడ్జి డాబ్నీ ఫ్రెడ్రిచ్ వెల్లడించారు. నాజీ భావజాలంతో వెళ్లి డెమోక్రటిక్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు యువకుడు యత్నించాడని పేర్కొన్నారు. 'ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకున్న ప్రభుత్వాన్ని నాజీ భావజాలంతో కూలగొట్టాలనే ఉద్దేశంతో సాయివర్షిత్ ఈ దాడికి యత్నించాడు. అవసరమైతే అధ్యక్షుడిని కూడా చంపాలని తాను నిర్ణయించు కున్నట్లు అంగీకరించాడు. దీంతో అతడికి 8ఏళ్లు శిక్ష విధించాలని న్యాయస్థానం నిర్ణయించింది. అతడి చర్యల వల్ల ధ్వంసమైన నిర్మాణాల తొలగింపు, పునర్నిర్మాణం మొదలైన ఖర్చులతో కలిపి నేషనల్ పార్క్ సర్వీస్‌కు జాఆ 4,322 డాలర్ల (సుమారు రూ.3,74,000) నష్టం వాటిల్లిందని కోర్టు పేర్కొంది. కోర్టు పత్రాల ప్రకారం.. 2023 మే 22 సాయంత్రం మిస్సోరిలోని సెయింట్ లూయిస్ నుంచి సాయి వర్షిత్ వాషింగ్టన్ డీసీకి చేరుకున్నాడు. అక్కడ ఓ ట్రక్కును అద్దెకు తీసుకొని రాత్రి 9.35 గంటల ప్రాంతంలో వైట్‌హౌస్ వద్దకువెళ్లి సైడ్‌వాక్‌పై వాహనాన్ని నడిపాడు. పాదచారులు భయాందోళనకు గురై పరుగులు పెట్టారు. అనంతరం శ్వేతసౌధం ఉత్తరభాగం వైపు భద్రత నిమిత్తం ఏర్పాటుచేసిన ట్రాఫిక్ బారియర్స్‌ను ఢీకొట్టాడు. ఆ తర్వాత ట్రక్కును రివర్స్ చేసి మరోసారి ఢీకొట్టాడు. వాహనం నుంచి కిందకుదిగి నాజీ జెండాను పట్టుకొని నినాదాలు చేశాడు.

# మేనకోడలితో శారీరక సంబంధం

## బ్లాక్‌మెయిల్‌తో యువతి ఆత్మహత్య.. నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

**బెంగళూరు,(క్రైమ్ మిర్రర్):** బెంగళూరులో దారుణం జరిగింది. ప్రైవేట్ ఫోటోలు, వీడియోలు లీక్ చేస్తానని సొంత మేనమామ బ్లాక్ మెయిల్ చేయడంతో సాఫ్ట్ వేర్ ఉద్యోగిని(24) హోటల్ గదిలోనే నిప్పంటించుకుంది. జనవరి 12న ఈ ఘటన జరగ్గా..16న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం..24 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సుహాసి సింగ్.. ఆరేళ్లుగా ఆమె తన మామ(ప్రవీణ్), అత్తతో కలిసి ఐఖీ పురంలోని ప్యారడైజ్ అపార్ట్‌మెంట్‌లో



ఉంటోంది. కాలక్రమేణా సుహాసీ సింగ్ తన మేనమామ ప్రవీణ్ ఇద్దరూ తరచుగా కలిసి ప్రయాణించేవారు. ఈ క్రమంలో మేనమామ ప్రవీణ్ తో శారీరకంగా దగ్గరైంది. అయితే ఇద్దరు ఏకాంతంగా ఉన్న ప్పుడు ఆమెకు తెలియకుండా ప్రవీణ్ ఫోటోలు,వీడియోలు తీసి పెన్ డ్రైవ్ లో సేవ్ చేశాడు. అయితే కొన్ని రోజుల తర్వాత సుహాసి సింగ్ ప్రవీణ్ ను దూరం పెట్టింది. సుహాసీ వేరే వ్యక్తితో క్లోజ్ గా ఉంటున్న విషయాన్ని ప్రవీణ్ తెలుసుకున్నారు.ఆమె వాట్సప్ లో చాటింగ్ కూడా చదివాడు. ఇవన్నీ తెలిసి కూడా తనతో సంబంధం కొనసాగించాలని తన మేనకోడలుసుహాసి సింగ్ పై ఒత్తిడి తెచ్చాడు. ఐటీపీఎల్ మెయిన్ రోడ్డులో తాను బుక్ చేసుకున్న హోటల్ గదిలో సుహాసిని కలవాలని డిమాండ్ చేశాడు. రాకపోతే తనతో సన్నిహితంగా ఉన్న ఫోటోలు ,వీడియోలను తన ఆమె తల్లిదండ్రులకు పంపిస్తానని బెదిరించాడు. దీంతో సుహాసి ఒక బాటిల్ లో పెట్రోల్ తీసుకుని హోటల్ గదికి వెళ్లింది. శారీరకంగా కలవాలని ఒత్తిడి తేవడంతో హోటల్ గదిలోనే తనను తాను నిప్పంటించుకుంది. ప్రవీణ్ ఆమెను బాత్రూమ్‌కి తీసుకెళ్లి షవర్ ఆన్ చేసి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించాడు.. కానీ అప్పటికే సుహాసికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను విక్టోరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు జనవరి 12న రాత్రి 10 గంటల సమయంలో మృతి చెందింది. నిందితుడు ప్రవీణ్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి దగ్గరి నుంచి మొబైల్, పెన్ డ్రైవ్ ను స్వాధీనం చేసుకున్నామని వైట్‌ఫీల్డ్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ శివకుమార్ గునార్ తెలిపారు. హెచ్ఏఎల్ పోలీస్ స్టేషన్‌లో బీఎన్ఎస్ సెక్షన్ల కింద ప్రవీణ్ అతని భార్యపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని చెప్పారు పోలీసులు.

# బళ్లారి అధికారులపై పలు ఫిర్యాదులు

## నేడు విచారించనున్న ఉప లోకాయుక్త

**బెంగళూరు,(క్రైమ్ మిర్రర్):** ప్రభుత్వ అధికారుల పనితీరుపై బళ్లారి జిల్లాలో 95 ఫిర్యాదులు నమోదు కాగా, వాటిని ఈ నెల 18వ తేదీన ఉప లోకాయుక్త అధికారి జస్టిస్ బి.వీరప్ప విచారించనున్నారు. వివిధ శాఖలకు చెందిన 255 మందిపై అధికారులు 95మంది లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. వీరందరికి జిల్లా లోకాయుక్త ఎస్పీ ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. ఈ నెల 18వ తేదీన జరగనున్న ఉప లోకాయుక్త విచారణలో నోటీసులు అందుకున్న అధికారులు, ఆయా శాఖల ప్రధాన అధికారులు విచారణకు హాజరు కావాల్సి ఉందని నోటీసులో సూచించారు. అన్ని కేసులు విచారణ జరపనున్న ఉప లోకాయుక్త అధికారి అదేరోజు ఆదేశాలు జారీ పిర్యాదులు పరిష్కరించనున్నట్లు సమాచారం. చాలా వరకు కేసులు ఇప్పటికే విచారణ జరిగాయి. ఇంకా కొన్నికేసులు విచారణ చేయాల్సి ఉంది. ఉప లోకాయుక్త అధికారి బళ్లారి పర్యటన నేపథ్యంలో జిల్లా పాలనామండలికి చురుకు ముట్టినట్లు అయింది. లోకాయుక్త అధికారులు ఏ ప్రభుత్వ కార్యాలయానికి ఎపుడు వస్తారోనని అధికారుల గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి. దీంతో రాత్రిపగలు తేడాలేకుండా ఆఫీసుల్లో ఫైళ్ళు సర్దేపనిలో నిమగ్నమయ్యారు. జిల్లాధికారి ఆధ్వర్యంలో ఇప్పటికే వివిధ శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి కార్యాలయాల్లో ఎలాంటి దోషాలు తలెత్తకుండా చూసుకోవాలని అధికారులకు సూచించినట్లు తెలుస్తోంది. దీంతో క్రింది స్థాయి ఉద్యోగులు, సిబ్బందికి కార్యాలయం ముఖ్యస్తులు విశ్రాంతి లేకుండా పనులు చేయిస్తున్నారు. గురువారం ఉపలోకాయుక్త అధికారి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. తెల్లవారు జామున బళ్ళారి ఏపీఎంసీ, జిల్లా ఆసుపత్రి, తాసీల్దారు కార్యాలయం, బళ్ళారి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కళాశాల(బిమ్స్)లో రోగులకు అందుతున్న వైద్యసేవలు గురించి పర్యవేక్షించడం గమనార్హం. జిల్లాస్థాయిలో అధికారులు, ప్రజా ప్రతినిధులు అవినీతికి సంబంధించి 30 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు, ఇందులో 15ఏళ్ళ క్రితం నమోదైన కేసులు ఉన్నట్లు తెలిసింది. కొన్నికేసులకు సంబంధించి చార్జ్‌షీట్ వేసేందుకు సంబంధిత అధికారుల నుండి అనుమతి కోరినట్లు తెలిసింది. కొన్ని అభ్యర్థులు తిరస్కరించగా, కొన్ని అభ్యర్థలు మంజూరు చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం. ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లో ఒక ప్రశ్నకు ప్రభుత్వం ఇచ్చిన సమాధానంలో ఈ వాస్తవాలు వెలుగుచూశాయి కేసుల స్వరూపం భిన్నంగా ఉండడంతో 18న విచారణ జరగనుందని అధికారుల సమాచారం.

# విశాఖ ఉక్కు హామీని నిలబెట్టుకున్న కేంద్రం

## ప్లాంట్ పునరుద్ధరణకు రూ.11,440 కోట్ల ప్యాకేజీ

## మీడియా సమావేశంలో వెల్లడించిన కేంద్రమంత్రులు


**న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్):** విశాఖ ఉక్కు పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించిన విషయాన్ని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి, మరో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మతో కలిసి రామ్మోహన్ నాయుడు మీడియాతో మాట్లాడారు. ప్యాకేజీ ప్రకటించిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి ఏపీ ప్రజల తరఫున ధన్యావాదాలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా నెలకొన్న స్టీల్ ప్లాంట్ సమస్యల పరిష్కారానికి అడుగులు పడ్డాయని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు నినాదాన్ని కేంద్రం కాపాడిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్యాకేజీపై రామ్మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. నష్టాలను అధిగమించేందుకు, ప్లాంట్ పూర్తి ఉత్పాదనతో లాభాల బాట పట్టేందుకు కేంద్ర ప్యాకేజీ దోహద పడుతుందన్నారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజల ఆకాంక్షల పట్ల కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమన్నారు. ఇకపోతే ప్రైవేటీకరన అంటూ సాగిన ప్రచారానికి తెరపడింది. విశాఖ ఉక్కుకు కేంద్ర ప్రభుత్వం కొత్త ఊపిరులూదింది. తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న కర్మాగారాన్ని పునరుజ్జీవింపజేయడానికి ముందుకొచ్చింది. ఇందుకోసం రూ.11,440 కోట్ల ప్యాకేజీని ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ శుక్రవారం అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్యాకేజీకి గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశం ఆమోదముద్ర వేసినట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. 'ఇది భారీ రివైవల్ ప్యాకేజీ. స్టీల్ రంగంలో విశాఖ ఉక్కు ప్రధానమైన సంస్థ. విశాఖ ఉక్కు..పోర్టు ఆధారిత స్టీల్ ప్లాంట్. ఈ పరిశ్రమను ఏళ్ల తరబడి సమస్యలు వేధిస్తున్నాయి. విశాఖ ఉక్కుకు ప్రకటించిన ఆర్థిక ప్యాకేజీ తక్షణం అమల్లోకి వస్తుంది. త్వరలో రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లు ప్రారంభమవుతాయి ఆగస్టు నాటికి 3 బ్లాస్ట్ ఫర్నేస్‌లు అందుబాటులోకి వస్తాయి. ముడి సరకు సరఫరా కోసం ఎన్ఎండీసీతో చర్చిస్తున్నాం. ఆత్మనిర్భర్ భారత్‌లో విశాఖ ఉక్కు కీలక పాత్ర పోషిస్తుంది. దేశ ఉక్కు అవసరాలు తీర్చడంలో విశాఖ స్టీల్ ఎ÷-లాంట్‌ది కీలక పాత్ర. స్టీల్ ఎ÷-లాంట్ యాజమాన్యం, కార్మికులకు శుభాకాంక్షలు' అని అశ్వినీవైష్ణవ్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారం చేపట్టిన రోజు నుంచి విశాఖ ఉక్కుపై ప్రత్యేక దృష్టి సారించారు. దిల్లీ వెళ్లిన ప్రతిసారి ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామిలతో సమావేశమై కర్మాగారం పునరుజ్జీవంపై చర్చలు జరుపుతూ ఉన్నారు. ఇటీవల ప్రధానిని మరోమారు కలిసి విశాఖ ఉక్కుకు అవసరమైన ఆర్థిక సాయం అందించాలని కోరారు. దీనిపై విభిన్న కోణాల్లో చర్చించిన అనంతరం కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఈ ప్యాకేజీకి ఆమోదం తెలిపింది. ఏటా 7.3 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యమున్న విశాఖ ఉక్కు కర్మాగారం 2023-24లో రూ.4,848.86 కోట్లు, 2022-23లో రూ.2,858.74 కోట్ల నష్టాన్ని మూటగట్టుకొంది. వర్కింగ్ క్యాపిటల్ కోసం చేసిన అప్పులు పెరగడం దీనికి ప్రధాన కారణం. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడంతో స్టీల్ ఎ÷-లాంట్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి ఎ÷-లాంటును సందర్శించారు. ఎ÷-లాంటు నిలదొక్కుకోవడానికి రూ.18 వేల కోట్లు అవసరమని విశాఖ ఎంపీ శ్రీభరత్, తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, కార్మిక సంఘాల నేతలు ఆయనకు విన్నవించారు. ఆ తర్వాత కొన్ని రోజులకే కేంద్ర ఉక్కుశాఖ ఎమర్జెన్సీ అడ్వాన్స్ ఫండ్ కింద.. జీఎస్టీ చెల్లింపులకు రూ.500 కోట్లు, ముడిసరకుకు సంబంధించి బ్యాంకు అప్పుల చెల్లింపులకు రూ.1,150 కోట్ల చొప్పున రెండు విడతల్లో సాయం చేసింది. వర్కింగ్ క్యాపిటల్ కోసం చేసిన అప్పుల భారం, తగినంత ముడిసరకు లేకపోవడం, కోర్టు ఎటాచ్‌మెంట్లు, ఇన్‌సాల్వెన్సీ ప్రొసీడింగ్స్‌తో విశాఖ ఉక్కు కర్మాగారం తీవ్ర ఇబ్బందుల్లో ఉంది. వీటిని తీర్చడంతోపాటు భవిష్యత్తులో తలెత్తే కష్టాల నుంచి తప్పించడానికి ఒక సమగ్ర ప్రణాళికను తయారు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇదివరకే పార్లమెంటు స్థాయీసంఘానికి చెప్పింది. దానిపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఆ సంఘం పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో సిఫార్సు చేసింది. దాని ప్రకారమే కేంద్ర ప్రభుత్వం ఈ ప్యాకేజీకి ఆమోదముద్ర వేసినట్లు తెలుస్తోంది.

## అప్పుడు భయం ప్రారంభమైంది: 'దిల్' రాజు



"గత కొన్నేళ్లుగా నేను నిర్మించిన సినిమాల్లో ఎక్కువ శాతం హిట్స్ కాలేకపోయాయి. అనుకున్న రిజల్ట్‌తో సినిమాలు రావటం లేదని నా సన్నిహితులు, శ్రేయోభిలాషులు అనడంతో నాలో తెలియని భయం ప్రారంభమైంది. నాలో స్టోరీ జడ్జిమెంట్ పోయిందా? మళ్లీ హీరోల కాంబినేషన్ లకే వెళ్లాలా? అని ఆలోచించాను. చిత్ర పరిశ్రమలో విజయాలు ఉంటేనే విలువ ఉంటుంది. ఈ సంక్రాంతికి వస్తున్న 'గేమ్ చేంజర్', 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలతో కచ్చితంగా నేను కమ్ బ్యాక్ అవుతాను" అని నిర్మాత 'దిల్' రాజు చెప్పారు. రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వం వహించిన 'గేమ్ చేంజర్' ఈ నెల 10న, వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి తెరకెక్కించిన 'సంక్రాంతికి వస్తున్నాం' ఈ నెల 14న విడుదల కానున్నాయి. ఈ సినిమాల నిర్మాత 'దిల్' రాజు సోమవారం హైదరాబాద్‌లో విలేకరులతో పంచుకున్న విశేషాలు...'గేమ్ చేంజర్' నాకెంతో ప్రత్యేకమైన సినిమా. 2021 ఆగస్టులో ఈ చిత్రాన్ని ప్రారంభించాను. ఈ మూవీ ప్రయాణంలో ఎన్నో ఆటుపోట్లు చూశాను. 'భారతీయుడు 2' సినిమా తర్వాత శంకర్‌గారి నుంచి వస్తున్న చిత్రం 'గేమ్ చేంజర్'. అలాగే 'ఆర్ఆర్ఆర్' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత రామ్‌చరణ్ నటించిన సినిమా కూడా ఇదే. కాబట్టి ఈ మూవీ విజయం మా ముగ్గురికీ ఎంతో ముఖ్యం. అన్ని వాణిజ్య అంశాలతోపాటు గౌరవంగా ఫీల్ అయ్యే సినిమా 'గేమ్ చేంజర్'. 'సంక్రాంతికి వస్తున్నాం' సూపర్ హిట్ అని అంటున్నారు. ఈ బజ్ రావటానికి కారణం అనిల్ రావిపూడి. 'ఎఫ్ 2' లాగా సూపర్ హిట్ కొట్టాలని కష్టపడ్డాడు. ఈ సినిమా కూడా బిగ్ హిట్ కాబోతోంది. ఏపీలో సినిమాల బెనిఫిట్ షోలు, టికెట్ ధరలపై ఓ స్పష్టత వచ్చింది. ఈ విషయాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారిని కూడా కలిసి వినతి చేస్తాను. అయితే తుది నిర్ణయం ప్రభుత్వానిదే.

## అన్నీ ఒకేసారి.. నా వల్ల కావట్లేదంటూ ఏడ్చేసిన మాధవీలత



హీరోయిన్, బీజేపీ నాయకురాలు మాధవీలత బోరున ఏడ్చేసింది. మహిళల ?మాన, ప్రాణ రక్షణ గురించి మాట్లాడినందుకు తనను అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని వాపోయింది. మామూలుగా ఉందామని చాలా ప్రయత్నించా.. కానీ నావల్ల కావడం లేదంటూ కన్నీళ్లు పెట్టుకుంది. ఈ వీడియోను తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేసింది. ఎంతో ప్రయత్నించా.. కానీ, నేనూ మనిషినే! నా ఆత్మగౌరవంపై జరిగిన దాడి.. నేను పడ్డ బాధను వర్ణించే పదాలు లేవు.

**ఎవరో వస్తారని ఎదురుచూడలేదు!**

ప్రతి క్షణం వేదన అనుభవిస్తున్నాను. కోపం, నిరాశ, ఆవేదన, దుఃఖం.. అన్నీ ఒకేసారి నన్ను కుదిపేస్తున్నాయి. ఎన్నోసార్లు ఎందరో నా ఆత్మవిశ్వాసాన్ని చిదిమేయాలని ప్రయత్నం చేశారు, పదే పదే ఇవే మాటలన్నారు. ఎవరో వస్తారని ఎప్పుడూ ఆశపడలేదు. సమాజం కోసం నేను సైతం అనుకున్నా.. నా పార్టీ (ప్రజల) కోసం, మహిళల కోసం, హిందూ ధర్మం కోసం మాత్రమే నిస్వార్థంగా నా వంతు నేను పోరాడుతున్నాను. ఎవరి దగ్గరా రూపాయి తీసుకున్నది లేదు.. ఎవరికీ ద్రోహం చేసిందీ లేదు.. మోసం చేసిందీ లేదు. కానీ కక్ష గట్టి మాటలంటూ ఉన్నారు. ఆడపిల్లగా ఎప్పుడూ సింపతీ గేమ్ ఆడలేదు. మహిళలకు అనుకూలంగా ఉన్న చట్టాలను ఉపయోగించలేదు. మగాడిలా పోరాడుతూనే ఉన్నాను. ఈ కష్టాలను అధిగమిస్తాను. నా ధైర్యాన్ని కోల్పోను. నాకు కుటుంబం, స్నేహితులతో పాటు అభిమానులు, సోషల్ మీడియాలో నన్ను ఫాలో అవుతున్న ఎందరో శ్రేయోభిలాషులు ఉన్నారు. నా బాధను మీతో పంచుకున్నందుకు క్షమించండి. మీ ప్రేమాభిమానం, ఆశీర్వాదాలు నాకు శక్తినిస్తాయి అని రాసుకొచ్చారు. డిసెంబర్ 31న తాడిపత్రిలోని జేసీ పార్కులో 'మహిళలకు మాత్రమే' అంటూ జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటుచేశారు. దీనిపై మాధవీలత స్పందిస్తూ.. జేసీ పార్కులో వేడుకలకు మహిళలు వెళ్లొద్దని సూచించారు.

## స్టార్ హీరోతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతున్న శ్రీలీల..




వరుస సినిమాలతో టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ అయిపోయింది శ్రీలీల. సినిమా రిజల్ట్స్ ఎలా ఉన్నా శ్రీలీలనే తీసుకోడానికి ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు హీరోలు, నిర్మాతలు. అయితే శ్రీలీల ఇటీవల తన డాక్టర్ ఎగ్జామ్స్ కోసం సినిమాలకు కొంత గ్యాప్ ఇవ్వగా ఇప్పుడు మళ్ళీ వరుస సినిమాలతో బిజీ అవుతుంది. ఇటీవలే పుష్ప 2 సినిమాలో ఐటెం సాంగ్ తో అదరగొట్టి బాలీవుడ్ కి కూడా హింట్ ఇచ్చేసింది.ప్రస్తుతం శ్రీలీల చేతిలో నాలుగు సినిమాలు ఉన్నాయి. తమిళ్ లో కూడా శివ కార్తికేయన్ సినిమాతో ఎంట్రీ ఇవ్వబోతుంది. అయితే శ్రీలీల బాలీవుడ్ లో ఎంట్రీ ఇస్తుందని ఎప్పట్నుంచో వార్తలు వినిపిస్తున్నాయి. ఆల్రెడీ ఓ సినిమా కూడా సైన్ చేసిందని గతంలో వార్తలు వచ్చాయి. తాజాగా బాలీవుడ్ టాక్ ప్రకారం శ్రీలీల బాలీవుడ్ స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్ తో ఎంట్రీ ఇవ్వనున్నట్టు తెలుస్తుంది.ఇటీవల వరుస హిట్స్ తో బాలీవుడ్ లో దూసుకుపోతున్నాడు కార్తీక్ ఆర్యన్. కార్తీక్ తాజాగా 'తు మేరీ మై తేరా.. మై తేరా తు మేరీ' అనే సినిమాని ప్రకటించాడు. బాలీవుడ్ బిగ్గెస్ట్ ప్రొడక్షన్స్ కరణ్ జోహార్ ధర్మ ప్రొడక్షన్స్ బ్యానర్లో సమీర్ విద్వాన్స్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతుంది. ఈ సినిమాలో శ్రీలీల హీరోయిన్ గా నటిస్తుందని బాలీవుడ్ లో వార్తలు వస్తున్నాయి.సినిమా అనౌన్స్ చేసినా హీరోయిన్ ఎవరో ప్రకటించలేదు. బాలీవుడ్ సమాచారం ప్రకారం శ్రీలీలనే ఈ సినిమాతో బాలీవుడ్ లో ఎంట్రీ ఇస్తుందని అంటున్నారు. దీంతో బాలీవుడ్ బిగ్గెస్ట్ ప్రొడక్షన్ హౌస్ తో శ్రీలీల లాంచ్ అవుతుందిగా అంటూ ఆమెని తెగ పొగుడుతున్నారు. బాలీవుడ్ ఎంట్రీ కోసం శ్రీలీల ఫ్యాన్స్ కూడా ఎదురుచూస్తున్నారు.



## వేసవిలో యాక్షన్

అజిత్ కుమార్ హీరోగా నటించిన స్టైలిష్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. త్రిష హీరో యిన్ . 'మార్క్ ఆంటోని' ఫేమ్ అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో మైత్రీమూవీమేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవి శంకర్ నిర్మించారు. ఈ మూవీని వేసవిలో ఏప్రిల్ 10న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. "అజిత్‌పాత్రలో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయి. ఇండియన్ మూవీ చరిత్రలోనే 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ఓ మైలురాయిగా నిలుస్తుంది" అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు జీవీ ప్రకాష్‌కుమార్ సంగీతం అందించారు. కాగా ఈ చిత్రాన్ని తొలుత సంక్రాంతికి రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ, ఏప్రిల్‌లో రిలీజ్ అవుతోంది.

## ఆ స్టార్ డైరెక్టర్ వల్లే నా కెరీర్ డ్యామేజ్ అయ్యింది



**తె**లుగు రాష్ట్రాలను షేక్ చేసిన సీరియల్ మొగలి రేకులు. ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్న ఈ సీరియల్ చాలా మందికి ఫేవరేట్. ఈ సీరియల్ లోని అని క్యారెక్టర్స్ ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయ్యాయి. ఈ సీరియల్ నటులకు అభిమానులు కూడా బాగానే ఉన్నారు. కాగా మొగలి రేకులు సీరియల్‌తో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు నటుడు సాగర్. ఇందులో అతను పోషించిన ఆర్కే నాయుడు పాత్రతో ఒక్క సారిగా ఫ్యామిలీ యాక్టర్‌గా మారిపోయాడు. ఈ సీరియల్ కంటే ముందు చక్రవాకం సీరియల్‌తోనూ బుల్లితెర ప్రేక్షకులను అలరించాడు సాగర్. సీరియల్స్ తోనే కాదు సినిమాల్లోనూ నటించాడు సాగర్. ఉదయ్ కిరణ్ మనసంతా నువ్వే, ప్రభాస్ మిస్టర్ పర్‌ఫెక్ట్ సినిమాల్లోనూ క్యారెక్టర్ రోల్స్ పోషించాడు. అలాగే హీరోగానూ చేసి ఆకట్టుకున్నాడు. 2016లో సిద్ధార్థ సినిమాతో హీరోగానూ ఎంట్రీ ఇచ్చాడు. అయితే ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర పెద్దగా ప్రభావం చూపలేదు. ఆ తర్వాత చాలా రోజుల పాటు సీరియల్స్, సినిమాలకు దూరంగా ఉండిపోయాడు. మధ్యలో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అనే ఓ సినిమా చేశారు. అయితే 2021లో షాదీ ముబారక్ సినిమాతో మళ్లీ హీరోగా వెండితెరకు ఎంట్రీ ఇచ్చాడు సాగర్. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు, శిరీష్ విడుదల చేసిన సినిమా అప్పట్లో మంచి విజయం సాధించాడు. దీంతో సాగర్ సినిమాల్లోనే కంటిన్యూ అవుతాడని చాలా మంది భావించారు. అయితే అదేమీ జరగలేదు. షాదీ ముబారక్ మూవీ తర్వాత అసలు స్క్రీన్‌పై కనిపించలేదీ ఫ్యామిలీ యాక్టర్.కాగా మిస్టర్ పర్ఫెక్ట్ సినిమాలో సాగర్ ఓ మంచి పాత్ర పోషించాడు. ఆ సినిమా దర్శకుడు దశరద్. మిస్టర్ పర్ఫెక్ట్ సినిమాలో ఆ పాత్ర కోసం ముందుగా సాగర్ ను సంప్రదిస్తే అతను నో చెప్పాడట.. అయితే ఆ సినిమాకు అసిస్టెంట్ దర్శకుడిగా చేస్తున్న ఇప్పటి స్టార్ డైరెక్టర్.. సాగర్ దగ్గరకు వచ్చి ఈ క్యారెక్టర్ రాజు సుందరంతో చేపించాలని అనుకున్నారు. లక్కీగా నీకు ఆ ఆఫర్ వచ్చింది. ఈ క్యారెక్టర్‌తో నీకు మంచి క్రేజ్ వస్తుందని చెప్పాడట. అతని మాటలు నమ్మి సాగర్ మిస్టర్ పర్ఫెక్ట్ సినిమా చేయడానికి అంగీకరించాడు. కానీ సినిమా బాక్సాఫీస్ దగ్గర మంచి హిట్ గా నిలిచింది. కానీ సాగర్ పాత్రకు అంతగా గుర్తింపు రాలేదు. దాంతో ఆ సినిమా వల్ల తనకు అనుకున్నంతగా గుర్తింపు రాకపోగా కెరీర్‌కు మైనస్ అయ్యిందని గతంలో ఓ ఇంటర్వ్యూలో సాగర్ తెలిపాడు.

## విశాల్ కి ఏమైంది..

### బక్కగా అయిపోయి.. వణుకుతూ.. క్లారిటీ ఇచ్చిన డాక్టర్లు..



**త**మిళ్ స్టార్ హీరో విశాల్ తెలుగువాడైన తమిళ్ లో వరుస సినిమాలతో హీరోగా ఎదిగాడు. ఇక్కడ తెలుగులో కూడా తన డబ్బింగ్ సినిమాలతో ప్రేక్షకులను మెప్పించి అభిమానులను సంపాదించుకున్నాడు. విశాల్ ఇటీవల మార్క్ ఆంటోనీతో హిట్ కొట్టాడు. చివరగా రత్నం సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు. కానీ ఆ సినిమా పరాజయం పాలైంది.విశాల్ హీరోగా నటించిన మదగజరాజా సినిమా 2013 నుంచి వాయిదా పడుతూ ఇప్పుడు 2025 సంక్రాంతికి రిలీజ్ కానుంది. అయితే ఎప్పుడూ ఫిట్ గా ఉండే విశాల్ తాజాగా ఓ ఈవెంట్లో బక్కగా అయిపోయి వణుకుతూ మాట్లాడాడు. నిన్న విశాల్ ఓ ఈవెంట్లో పాల్గొనగా ఆ ఈవెంట్లో మాట్లాడుతుంటే అతని చెయ్యి వణుకుతూనే ఉంది. విశాల్ ఇలా బక్కగా అయిపోయి, వణుకుతూ మాట్లాడుతుండటంతో ఫ్యాన్స్ ఆందోళన వ్యక్తం చేసారు. విశాల్ కి ఏమైంది అంటూ ట్విట్టర్లో ట్రెండ్ చేస్తున్నారు. దీంతో విశాల్ టీమ్ స్పందించి విశాల్ డాక్టర్ తో అధికారిక ప్రకటన ఇప్పించారు. డాక్టర్ రిలీజ్ చేసిన అప్డేట్ ప్రకారం.. ప్రస్తుతం విశాల్ వైరల్ ఫీవర్ తో బాధపడుతున్నారు. అతను ట్రీట్మెంట్ తీసుకోవాలి. అలాగే అతనికి పూర్తిగా బెడ్ రెస్ట్ కావాలి ఈ సమయంలో అని తెలిపారు. దీంతో విశాల్ త్వరగా కోలుకోవాలని ఫ్యాన్స్, నెటిజన్లు కోరుకుంటున్నారు.అయితే కేవలం వైరల్ ఫీవరేనా, ఎందుకు అంత బక్కగా అయిపోయాడు అని ఫ్యాన్స్ ప్రశ్నిస్తున్నారు. ఏది ఏమైనా విశాల్ ప్రస్తుతం అనారోగ్య సమస్యతో బాధపడుతున్నట్టు తెలుస్తుంది. విశాల్ చేతిలో ప్రస్తుతం డిటెక్టివ్ సీక్వెల్ సినిమా మాత్రమే ఉంది. మదగజరాజా సంక్రాంతికి రిలీజ్ అవుతుండగా విశాల్ మాత్రం ఈ సినిమా ప్రమోషన్స్ లో పాల్గొనట్లేదు. అనారోగ్య సమస్యల వల్లే ప్రమోషన్స్ కి దూరం ఉన్నట్టు తెలుస్తుంది.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.